జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 23, జూన్ 2024 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం



## ఎక్కడ తగ్గాలో...ఎక్కడ గెలవాలో
# తెలిసిన వ్యక్తి పవన్ కళ్యాణ్

- స్పీకర్‌గా అత్యంత సీనియర్ నేత అయిన అయ్యన్న పాత్రుడి ఎంపిక హర్షణీయం
- శాసనసభ విలువలను గత ప్రభుత్వం మంట గలిపింది....దూషణలకు, వ్యక్తిత్వ హననానికి వేదిక చేసింది
- నేతలు, వారి కుటుంబ సభ్యులపై దారుణ వ్యాఖ్యలతో అసెంబ్లీని నాడు కౌరవ సభలా నడిపారు
- ప్రజల ఆశీర్వాదంలో మళ్లీ గౌరవ సభలో అడుగుపెట్టాను.
- నాడు అహంకారంతో ప్రతిపక్షాన్ని హేళన చేశారు.... 23 సీట్లే అని వ్యాఖ్యలు చేశారు
- మాకు వచ్చిన 164లో....1+6+4 కలిపితే 11.... ఇవీ వైసీపీకి వచ్చిన సీట్లు
- పవన్‌ను అసెంబ్లీ గేటు కూడా తాకనివ్వమన్నారు... ఆయన పోటీచేసిన అన్ని స్థానాల్లోను గెలిచారు
- వైనాట్ 175 అన్నవాళ్లకు ప్రజలు 11 సీట్లు ఇచ్చారు. ఇది దేవుడి స్క్రిప్ట్ అనుకోవాలా?
- అహంకారంతో వ్యవహరించడం మంచిది కాదు... సభలో ప్రజల సమస్యలపై చర్చించాలి
- పోరాట యోధుడు, బీసీ నేత అయ్యన్నను సభాధ్యక్షులుగా చూస్తుంటే గర్వంగా ఉంది
- శాసన సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- స్పీకర్ ఎన్నికపై అయ్యన్న పాత్రుడుకు అభినందనలు తెలుపుతూ సిఎం చంద్రబాబు తొలి ప్రసంగం

2లో..

## జగన్‌పై 'పులివెందుల'
# తిరుగుబాటు

- జగన్ ఇంట్లోనే డౌన్ డౌన్ నినాదాలు
- పవర్‌లో ఉన్నప్పుడు పట్టించుకోలేదు
- పులివెందులకు చుట్టంచూపుగా వచ్చారు
- తాడేపల్లికే పరిమిత మయ్యారు కదా?
- ఇప్పుడు మళ్లీ పులివెందులకు ఏ ముఖం పెట్టుకుని వచ్చారు?
- జగన్ ఇంటిపై దండెత్తిన వైసీపీ కార్యకర్తలు
- అద్దాలు ధ్వంసం చేసిన పులివెందుల ఆగ్రహం
- తలుపులు పగులకొట్టిన వైనం
- జగన్ ఇంట్లోకి వెళ్లే యత్నం
- అడ్డుకున్న జగన్ సిబ్బంది

(మార్తి సుబ్రహ్మణ్యం)



నిన్నటి వరకూ అభిమానుల దృష్టిలో ఆయన పులి. సింహం. సింగిల్‌గా వచ్చే సింహం. ఒక నెల క్రితం వరకూ ఆయన మాటే వేదం. చెప్పిందే శాసనం. ఆయన చల్లని చూపులు, కరుణాకటాక్షాల కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల పడిగాపులు. ఆయన సభల కోసం తరలివెళ్లిన వేలాదిమంది కార్యకర్తలు. మా జిల్లాకు రావాలంటే మా జిల్లాకు రావలని వినతులు. ఇదంతా ఆయన గద్దె దిగకముందు కనిపించిన దృశ్యాలు.


ఇప్పుడు ఆయన ఇంటి ముందు వందలాదిమంది కార్యకర్తల తోపులాట. ఇప్పుడెందుకు వచ్చారంటూ అద్దాలు- తలుపులు పగులకొట్టే తిరుగుబాటు. అధికారంలో ఉన్నప్పుడు తాడేపల్లిలో కూర్చున్నావ్. అప్పుడు మేం గుస్తుకురాలేదు. ఇప్పుడు అధికారం పోయిన తర్వాత మేం గుర్తుకువచ్చామా? అని తలుపులు బాది, నేరుగా ఇంట్లోకే చొచ్చుకుపోయేంత ఆగ్రహం. మరి ఆ సింహం ఏ చేసింది? లోపల తలుపులకు గొళ్లెం పెట్టుకుంది. ఇదీ.. పులివెందులలో మాజీ సీఎం-వైసీపీ అధినేత జగన్ ఇంటిపై పులివెందుల తిరుగుబాటు కథ.

'సింహం సిక్కయిపోతే పందికొక్కులు ఫ్లూటు వాయించాయ'న్నది ఓ తమిళ డబ్బింగ్ సినిమా డైలాగ్. వైసీపీ అధినేత-మాజీ సీఎం జగన్‌రెడ్డి ఓటమి పరాభవం, చివరాఖరకు సొంత పులివెందులకూ అలుసయిపోయింది. అధికారంలో ఉన్నప్పుడు పట్టించుకోని నువ్వు, ఇప్పుడు ఎందుకు వచ్చావ్ అంటూ.. పులివెందుల ఏకకంఠంతో జగన్ ఇంట్లోనే ఉన్నప్పుడే ఆయన ఇంటిపై తిరుగుబాటు చేసి, అద్దాలు, తలుపులు ధ్వంసం చేసిన వైనం వైసీపీని వణికిస్తోంది. జగన్ డౌన్ డౌన్ అంటూ నినదించారు. ఏకంగా అధినేతపైనే తిరుగుబాటు చేసేంతంగా తిరగబడ్డ పులివెందుల ఆంధ్ర రాష్ట్రాన్ని ఆశ్చర్యపరిచింది.

ఓటమి తర్వాత తొలిసారి పులివెందుల పర్యటనకు వచ్చిన జగన్‌ను స్వాగతించేందుకు, ఎయిర్‌పోర్టుకు ఎవరూ రాకపోవడం ఒకషాక్ అయితే.. పులివెందుల ఇంటికి వెళ్లిన జగన్ ఇంటిపై వందలాది వైసీపీ కార్యకర్తలు తిరుగుబాటు చేయడం మరో షాక్. కడపకు వెళ్లిన జగన్‌కు చెవిరెడ్డి, అవినాష్‌రెడ్డి, ద్వారనాథ్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, అంజాద్‌బాషా మిగతా.. 2లో

## పొగిడేవారికే కాదు..
# మాకూ అవకాశాలివ్వండి

- ఇకపై వైసీపీ సీట్లన్నీ ఖాళీగా ఉంటాయేమో
- స్పీకర్‌కు ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు



అమరావతి:

"అధ్యక్షా మిమ్మల్ని పొగిడేవారికే కాదు. మంత్రులకే కాదు. మాకూ మాట్లాడే అవకాశం ఇవ్వాల"ని ఉండి టీడీపీ ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు స్పీకర్ అయ్యన్నపాత్రుడును కోరారు. సీనియర్ ఎమ్మెల్యే చింతకాయల అయన్నపాత్రుడు స్పీకర్‌గా ఎంపికయిన నేపథ్యంలో, ఎమ్మెల్యేలు ఆయనను అభినందిస్తూ శాసనసభలో ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ.. "అధ్యక్షా.. మిమ్మల్ని పొగిడేవారినే కాదు. మంత్రులకే కాదు. మాలాంటి ఎమ్మెల్యేలకూ మాట్లాడే అవకాశం ఇవ్వాలి" అని కోరారు. 'సింహం లాగా చెప్పుకునే వారు నిన్న సభకు వచ్చి తమ పేరు మర్చిపోయి తడబడ్డారు. అయ్యన్నను స్పీకర్‌గా ఎన్నుకుంటున్నారని తెలియగానే వాళ్ల పేర్లు కూడా మర్చిపోయే పరిస్థితి వచ్చింది. ఇకపై వైసీపీ సీట్లన్నీ ఖాళీగా ఉంటాయేమో" నని రఘురామరాజు వ్యంగ్యాస్త్రం సంధించారు.

## బాబుతో పోటీ పడి పని చేసే అవకాశం

- అక్కడున్నది చంద్రబాబు. 12 గంటలు పని చేస్తే సరిపోదు
- 12 గంటలు పని చేస్తే సరిపోదు
- మనం కూడా 18 గంటలు పని చేయాల్సిందే
- బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ & రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ 24వ వార్షికోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి






హైదరాబాద్:

ఎన్టీఆర్ ఆలోచనతో ఏర్పడ్డ ఈ ఆసుపత్రి 24ఏళ్లుగా కోట్లాది మందికి సేవలందించడం సంతోషం. పేదలకు సేవలందించే ఉద్దేశంతో ఆనాడు ఎన్టీఆర్ ఈ ఆసుపత్రి నిర్మాణానికి పూనుకున్నారు. ఎన్టీఆర్ ఆలోచన విధానాలను కొనసాగించాలని చంద్రబాబు నాయుడు ఆసుపత్రిని పూర్తి చేసి పేదలకు మిగతా.. 2లో

## పవన్ కళ్యాణ్
# 'జన దర్బార్'

- జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద ప్రజా సమస్యలు వినేందుకు ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్
- శనివారం మధ్యాహ్నం బాధితుల సమస్యలను నేరుగా విన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



అమరావతి,మహానాడు:

ప్రతిపక్షంలో ఉన్నా... అధికారపక్షంలో ఉన్నా ప్రజా సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారం దిశగా అడుగులు వేయడమే తన మొదటి ప్రాధాన్యం అని పవన్ కళ్యాణ్ మరోసారి నిరూపించారు. సమస్యలతో ఉన్న ప్రజలు తనను కలుసుకునేందుకు ఎప్పుడొచ్చినా తాను వారిని స్వయంగా కలుస్తానన్న మాటను నిజం చేస్తూ ఉప ముఖ్యమంత్రి హోదాలో శనివారం జనసేన పార్టీ కార్యాలయానికి వినతులు తీసుకొని వచ్చిన బాధితులతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడి వారి సమస్యలు నేరుగా విన్నారు. పరిష్కారానికి తగు హామీలను ఇచ్చారు.

శనివారం మధ్యాహ్నం అసెంబ్లీ నుంచి తిరిగి వస్తూ జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం వెలుపల బాధితుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ వద్ద ఆగి మిగతా.. 7లో



# కలెక్టర్ల బదిలీలు

- వేణుగోపాల్‌రెడ్డి, మల్లికార్జునకు నో పోస్టింగ్
- గుంటూరుకు నాగలక్ష్మి, పోస్టింగ్‌పై టీడీపీ నేతల విస్మయం
- ధనంజయరెడ్డి వర్గీయురాలికి రాజధాని కలెక్టర్ పోస్టింగ్
- 18 మంది కలెక్టర్ల బదిలీలు

అమరావతి:

చంద్రబాబునాయుడు సీఎంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి ఐఏఎస్‌లను భారీ సంఖ్యలో బదిలీ చేశారు. 18 మంది జిల్లా కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో విశాఖ కలెక్టర్‌గా పనిచేసి, 'జగన్‌భక్త అధికారి'గా విమర్శలు ఎదుర్కొన్న మల్లికార్జున, గుంటూరు జిల్లా కలెక్టర్‌గా మిగతా.. 2లో



# ఎవరా ఇద్దరు?



టీడీపీ సర్కారు ఏర్పడిన కొద్దిరోజుల్లోనే రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు రావడం సందడిగా మారింది. ఎన్నికల ముందు వైసీపీ నుంచి టీడీపీలో చేరిన ఇక్బాల్, సి.రామచంద్రయ్య తమ ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశారు. రామచంద్రయ్యపై అనర్హత వేటు వేశారు. ఆరకంగా ఖాళీ అయిన రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నిక జరగనుంది. మూడేళ్ల పదవీకాలం ఉండటంతో, ఆశావహుల సంఖ్య కూడా బాగానే కనిపిస్తోంది. ఎమ్మెల్సీ పదవులు ఆశిస్తున్న నేతల సంఖ్య ఎక్కువగానే ఉన్నప్పటికీ, తాజా ఎన్నికల్లో తెరవెనుక పనిచేసిన నేతలకు ఈసారి అవకాశం ఇస్తారా? లేదా? అన్నది చర్చనీయాంశమయింది.

2లో..



# మాది ఉద్యోగులను వేధించే సర్కారు కాదు

- రెవిన్యూమంత్రి అనగాని

అమరావతి,మహానాడు:

ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత తహశీల్దార్లను తిరిగి వారి పాత జిల్లాలకు కేటాయించాలని కోరుతూ, ఏపీ రెవిన్యూమంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఏపీ రెవిన్యూ అసోసియేషన్ సంఘ నేత బొప్పరాజు మిగతా.. 2లో

2

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ ఆదివారం 23, జూన్ 2024

## జగన్‌పై 'పులివెందుల' తిరుగుబాటు

(మొదటిపేజీ తరువాయి..)

తప్పు ఎవరూ రాకపోవడం షాక్‌నిచ్చింది.

తర్వాత పులివెందులకు వచ్చిన జగన్, కొద్దిసేపటి తర్వాత ఊహించని తిరుగుబాటు ఎదుర్కొన్నారు. జగన్ వస్తున్నారని తెలిసిన వైసీపీ కార్యకర్తలు, వందల సంఖ్యలో ఆయన ఇంటికి తరలివెళ్లారు. అధికారంలో ఉండగా తాడేపల్లి ప్యాలెస్‌కు పరిమితమయి, తమను పట్టించుకోని జగన్.. ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని వచ్చారని నిలదీసే యత్నం చేశారు. అయితే సెక్యూరిటీ సిబ్బంది వారిని నిలువరించారు. అయినా ఇంట్లోకి తోసుకువెళ్లే ప్రయత్నంలో భాగంగా అద్దాలు ధ్వంసమయ్యాయి.

ఈ దృశ్యాలు టీవీ చానెళ్లలో చూసిన వైసీపీ శ్రేణులు బిత్తరపోయారు. వైఎస్ కుటుంబ అడ్డాగా పేరున్న పులివెందులలో, ఆయన ఇంటిపైనే సొంత కార్యకర్తలు తిరుగుబాటు చేయటం రాజకీయ వర్గాలను నోరెళ్లబెట్టేలా చేసింది. జగన్ ఇంటిపై కార్యకర్తలు దూసుకువెళుతున్న దృశ్యాలు, టీవీలో చూసిన ప్రజలు కూడా జగన్‌పై జరిగిన తిరుగుబాటును చూసి నోరెళ్లబెట్టాల్సి వచ్చింది.

### జగన్ ఇంటిపై కార్యకర్తల దాడి అబద్ధమట

అయితే జగన్ ఇంటిపై దాడి చేశారన్న వార్తలు అబద్ధమని వైసీపీ ట్వీట్ చేసింది. అవి తప్పుడు వార్తలని, వాటిని నమ్మవద్దని కోరింది.

## బాబుతో పోటీ పడి పని చేసే అవకాశం

(మొదటిపేజీ తరువాయి..)

సేవలు అందించేలా చేశారు.

పేదలకు వైద్య సేవలు అందించాలన్న ఎన్టీఆర్ ఆలోచనలు అమలవుతున్న తీరు చూసి ఆయన మనల్ని స్వర్గం నుంచి ఆశీర్వదిస్తారు. ఆసుపత్రికి సంబంధించి ఎలాంటి సహకారం కావాలన్నా మా ప్రభుత్వం అండగా ఉంటుంది. అభివృద్ధి, సంక్షేమంలో చంద్రబాబు నాయుడుతో పోటీ పడి పని చేసే అవకాశం నాకు వచ్చింది. అభివృద్ధి, సంక్షేమంలో ప్రపంచానికి తెలుగు రాష్ట్రాలు ఆదర్శంగా నిలవాలి.

తెలంగాణలో హెల్త్ టూరిజం హబ్ ను ఏర్పాటు చేయాలని మా ప్రభుత్వం ఆలోచిస్తోంది. అన్ని రకాల వైద్య సేవలు అందేలా హెల్త్ టూరిజం హబ్ ఉంటుంది. ఇందులో బసవతారకం ఆసుపత్రికి చోటు ఖచ్చితంగా ఉంటుంది. వెయ్యి ఎకరాల్లో హెల్త్ టూరిజం హబ్‌ను ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. ప్రపంచ దేశాల నుంచి ఎవరైనా హైదరాబాద్‌కు వస్తే అన్ని రకాల వైద్య సేవలు అందుతాయనేలా తీర్చిదిద్దుతాం..

రాజకీయం, సంక్షేమం ఎన్టీఆర్ వారసత్వంగా ఇచ్చారు. ఎన్టీఆర్ మూడో తరం కూడా దీనిని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షిస్తున్నా.

అక్కడున్నది నారా చంద్రబాబు. 12 గంటలు పని చేస్తే సరిపోదు. సహచర మంత్రుల సమక్షంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అలెర్ట్.

గతంలో 12 గంటలు పని చేస్తే సరిపోతుంది అనుకునే వాడిని. ఇప్పుడు చంద్రబాబు 18 గంటలు చేసి నేను 12 గంటలు చేస్తే బాగుండదు కాబట్టి మనం కూడా 18 గంటలు పని చేయాల్సిందే అని మా అధికారులకు, సహచరులకు చెప్పాను.

# ఎవరా ఇద్దరు?

- రెండు ఎమ్మెల్సీలు దక్కేదెవరు?
- రెండు ఎమ్మెల్సీ ఖాళీలు
- మూడేళ్ల పదవీకాలం
- రామచంద్రయ్య, ఇక్బాల్ రాజీనామా
- మళ్లీ ఆ ఇద్దరినీ కొనసాగిస్తారా?
- కొత్త వారికి అవకాశమిస్తారా?
- కొత్తగా తెరపైకి వర్మ, వంగవీటిరాధా
- రేసులో బీద రవిచంద్ర, మంతెన రాజు, కోనేరు సురేష్, మాల్యాద్రి, పట్టాభి, వర్ల

(మార్తి సుబ్రహ్మణ్యం)

టీడీపీ సర్కారు ఏర్పడిన కొద్దిరోజుల్లోనే రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు రావడం సందడిగా మారింది. ఎన్నికల ముందు వైసీపీ నుంచి టీడీపీలో చేరిన ఇక్బాల్, సి.రామచంద్రయ్య తమ ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశారు. రామచంద్రయ్యపై అనర్హత వేటు వేశారు. ఆరకంగా ఖాళీ అయిన రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నిక జరగనుంది. మూడేళ్ల పదవీకాలం ఉండటంతో, ఆశావహుల సంఖ్య కూడా బాగానే కనిపిస్తోంది.

ఎమ్మెల్సీ పదవులు ఆశిస్తున్న నేతల సంఖ్య ఎక్కువగానే ఉన్నప్పటికీ, తాజా ఎన్నికల్లో తెరవెనుక పనిచేసిన నేతలకు ఈసారి అవకాశం ఇస్తారా? లేదా? అన్నది చర్చనీయాంశమయింది. ఆ ప్రకారంగా మాజీ ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్, మంతెన సత్యనారాయణరాజు, టీడీఎల్పీ ఆఫీసు కార్యదర్శి కోనేరు సురేష్ పేర్లు చర్చకు వస్తున్నట్లు తెలుస్తోంది. వీరిలో బీద, మంతెన ఇటీవలి ఎన్ని ల్లో ట్రబుల్‌షూటర్స్‌గా పనిచేశారు. ఆశావహులతో చర్చలు, బుజ్జగింపులు, కీలక అంశాలపై అభ్యర్థులతో చర్చలు, జిల్లా నేతలతో సమన్వయం తదితర అంశాల్లో వారిద్దరే కీలకపాత్ర పోషించారు. వీరికి కొన్ని జిల్లాల సమన్వయ బాధ్యతలు కూడా అప్పగించారు. బీద-మంతెనకు వివాదరహిత నేతలన్న పేరుతోపాటు, లోకేష్ వర్గంగా పేరుండటం అనుకూలించే అంశం.

వీరిలో బీద యాదవ సామాజికవర్గానికి చెందిన నేత కావడం మరో సానుకూల అంశం. పార్టీ కష్టకాలంలో ముందుండే బీదకు, నాయకత్వానికి ఇష్టుడిగా పేరుంది. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా దానిని విజయవంతంగా పూర్తి చేసిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఈయన లోకేష్ టీంలో కీలకనేత. ఈ కోణంలో బీద రవిచంద్రయాదవ్‌కు ఎమ్మెల్సీ ఇచ్చే అవకాశం ఉందంటున్నారు.

ఒకవేళ కులసమీకరణ కుదరకపోతే.. బీదకు టీడీపీ చైర్మన్ పదవి వరించే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బీసీలలో అత్యధిక శాతం మంది ఉన్న యాదవులకు టీటీడీ చైర్మన్ ఇవ్వడం ద్వారా, వారిని మెప్పించినట్లవుతుంది.

ఇక మంతెన సత్యనారాయణరాజు కూడా, చాపకింద నీరులా తనకు అప్పగించిన బాధ్యత పూర్తిచేసే నైజం ఉన్న యువనేత. ఈయన కూడా లోకేష్ టీమ్‌లో కీలకనేత. కిందస్థాయి పార్టీ శ్రేణులు- నియోజకవర్గస్థాయినేత మనోభావాలు నాయకత్వం దృష్టికి తీసుకువెళ్లే రాజుది లో ప్రొఫైల్ శైలి. ఈ క్రమంలో మంతెనకు ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వడం ఖాయమన్న చర్చ జరుగుతోంది.

పార్టీ విపక్షంలో ఉన్నప్పుడు కీలకమైన దొంగఓట్ల ఏరివేత అంశంలో క్రియాశీల పాత్ర పోషించి, దాదాపు 40 లక్షల దొంగఓట్లను ఈసీ ద్వారా తొలగించేలా చేయడంలో కీలకపాత్ర పోషించిన, టీడీఎల్పీ ఆఫీసు కార్యదర్శి కోనేరు సురేష్ పేరు కూడా ఎమ్మెల్సీ పేరుకు వినిపిస్తోంది. ఆయన ఆ మేరకు పార్టీ అధినేతకు దరఖాస్తు చేశారంటున్నారు.

ఒక్కో ఇంట్లో 27 ఓట్లు ఉన్న అంశాన్ని వెలుగులోకి తీసుకురావడంతో, డబుల్ ఎన్‌రోల్‌మెంట్, చనిపోయిన వారి ఓట్లు తొలగించడం, దొంగఓట్ల ఏరివేత కోసం నియోజకవర్గాల వారీగా నిర్వహించిన శిక్షణ శిబిరాలు-సమీక్షలకు నేతృత్వం వహించిన సురేష్ చాలా ఏళ్ల నుంచి, టీడీపీఎల్పీలో చురుకుగా పనిచేస్తున్నారు. వివాదరహితుడు, మేధావిగా, సమకాలీన రాజకీయాలపై అవగాహన ఉన్న సురేష్ కూడా ఎమ్మెల్సీ రేసులో ఉన్నట్లు తెలుస్తోంది.

ఇక వీరు కాకుండా నాలెడ్జ్ సెంటర్‌ను తీర్చిదిద్ది.. పార్టీ విధానాలు, దిశానిర్దేశం చేసి, నాయకత్వం ఆ దిశగా నిర్ణయాలు తీసుకోవడంలో కీలకపాత్ర పోషించిన మాల్యాద్రి పేరు కూడా ఎమ్మెల్సీ పదవికి వినిపిస్తోంది. పార్టీ విపక్షంలో ఉన్నప్పుడు జగన్ సర్కారుపై విరుచుకుపడి, ఆయన బాధితుడైన పార్టీ అధికార ప్రతినిధి పట్టాభి.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ వాణిని సమర్ధవంతంగా వినిపించిన పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య పేర్లు కూడా వినిపిస్తున్నాయి.

అయితే అసలు కొత్తవారికి ఎమ్మెల్సీలు ఇవ్వాలా? లేక పదవులు త్యాగం చేసి పార్టీలో చేరిన వారినే తిరిగి కొనసాగించాలా? అన్న విధాన నిర్ణయంపై, నాయకత్వం ఎటు మొగ్గుచూపుతుందో చూడాల్సి ఉంది. నిజానికి సి.రామచంద్రయ్య, ఇక్బాల్ పార్టీలో చేరే సమయంలో ఎమ్మెల్సీ పదవులకు, రాజీనామా చేయవద్దని నాయకత్వం సూచించిందని పార్టీ వర్గాలు గుర్తు చేస్తున్నాయి. అయితే తమ నిజాయితీ నిరూపించుకునేందుకు ఇక్బాల్ రాజీనామా చేశారు.

నిజానికి గతంలో సి.రామచంద్రయ్యకు రాజ్యసభ ఇచ్చినా, పార్టీ కష్టకాలంలో వెళ్లిపోయారని పార్టీ నేతలు గుర్తు చేస్తున్నారు. ఇక ఐపిఎస్ ఇచ్చిన తర్వాత కూడా, ఇక్బాల్ వైసీపీలో చేరారంటున్నారు. ఈ క్రమంలో వారిద్దరికి ఈసారి ఎన్నికల్లో అవకాశం ఇవ్వవచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఇదిలాఉండగా.. తాజాగా మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా.. పిఠాపురంలో పవన్ కల్యాణ్ కోసం త్యాగం చేసిన, మాజీ ఎమ్మెల్యే వర్మ పేరు కూడా తెరపైకి రావడం చర్చనీయాంశమయింది. వంగవీటి రాధాకు ఎమ్మెల్సీ ఇవ్వడం ద్వారా, కాపులను మెప్పించడంతో పాటు, కొత్త తరానికి అవకాశం ఇచ్చినట్టవుతుందని భావిస్తున్నారు. నిజానికి రాధాకు గత ఎన్నికల్లోనే పోటీ చేయమని సూచించినప్పటికీ, ఆయన నిరాకరించారు. బందరు సీటు నుంచి పోటీ చేయాలని నాయకత్వం ప్రతిపాదించింది.

పిఠాపురంలో పవన్‌కు సీటు ఇచ్చినప్పుడు అసంతృప్తితో, స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగే సందర్భంలో ఆయనకు ఎమ్మెల్సీ ఇస్తామని నాయకత్వం హామీ ఇచ్చింది. దానితో పట్టుదలతో పనిచేసిన వర్మ, జనసేనాధిపతి పవన్ విజయం కోసం మనస్ఫూర్తిగా పనిచేశారు. వర్మ గతంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి, విజయం సాధించిన విషయం తెలిసిందే.

## ఎక్కడ తగ్గాలో...ఎక్కడ గెలవాలో తెలిసిన వ్యక్తి పవన్ కళ్యాణ్

అమరావతి,మహానాడు: శాసన సభ సాంప్రదాయాలను వికృత పోకడలతో గత ప్రభుత్వం దెబ్బతీసిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. నాటి సభలో సమస్యలపై మాట్లాడటానికి మైక్ ప్రతిపక్ష సభ్యులకు మైక్ ఇవ్వలేదని.....దూషణలు, బూతులు, వెకిలి చేష్టలతో సభ విలువలను దెబ్బతీశారని చంద్రబాబు అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే సభలో దాడికి పాల్పడటంతో పాటు నీచంగా మాట్లాడి వ్యక్తిత్వం హననానికి పాల్పడ్డారిని ఆవేదన వ్యక్తం చేశారు.

సార్వత్రిక ఎన్నికల్లో నేడు ప్రజలు తమకు ఘన విజయం అందించడంతో పాటు పెద్ద బాధ్యత అప్పగించారని...ప్రత్యర్థి పార్టీలకు చెందిన శాసననభ సభ్యులను ఎగతాళి చేసి అవమాన పరచకూడదని సభలోని సభ్యులకు సూచించారు. శాసనసభ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన చింతకాయల అయ్యన్న పాత్రుడును చంద్రబాబు నాయుడు అభినందించారు. అనంతరం...స్పీకర్ స్థానం వరకూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్ తో వెళ్లి అయ్యన్నపాత్రుడుని స్పీకర్ చైర్ లో కూర్చోబెట్టారు.



అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు సభలో ప్రసంగించారు.

బీసీ నేతను స్పీకర్ చూస్తుంటే సంతోషంగా ఉంది

"తెలుగు రాష్ట్రాల్లో సీనియర్ శాసనసభ్యులు, బీసీ నేతగా గుర్తింపు ఉన్న మిమ్మల్ని నేడు శాసనసభ అధ్యక్ష పదవిలో చూడటం సంతోషంగా ఉంది..గర్వంగా ఉంది. సభ్యులందరి ఆమోదంతో 16వ శాసనసభ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు అభినందనలు తెలుపుతున్నా. యువత రాజకీయాల్లోకి రావాలని నాడు ఎన్టీఆర్ ఇచ్చిన పిలుపుతో 23 ఏళ్ల వయసులో అయ్యన్నపాత్రుడు ఎమ్మెల్యేగా గెలిచారు. 7సార్లు ఎమ్మెల్యేగా, ఒక సారి ఎంపీగా, మంత్రిగా తెలుగురాష్ట్రాల్లో ప్రత్యేక ముద్ర వేశారు. ఏ పదవిచ్చినా దానికి వన్నె తెచ్చారు. నర్సీపట్నంలో టీడీపీ ఆవిర్భావం నుంచి ఆయనే పని చేస్తున్నారు. 16 ఏళ్లు మంత్రిగా పనిచేసిన అనుభవం ఉంది.

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడిగా 10 ఏళ్ల పాటు పార్టీకి సేవలందించారు. అయ్యన్న రాజీపడని నేత...విలక్షణ నేత. ఇప్పటికీ ఆయన ఫైర్ బ్రాండ్ గానే ఉన్నారు. కరుడుకట్టిన పసుపు యోధుడిగా ఆయనకు పేరుంది. నీతి, నిజాయితీ, నిబద్ధతను ఆయన పుణికిపుచ్చుకున్నారు. ఉత్తరాంధ్ర, విశాఖ అభివృద్ధికి కృషి చేశారు. కానీ అయ్యన్న పాత్రుడు తన రాజకీయ జీవితంలో ఏనాడూ పడని ఇబ్బందులు గత ఐదేళ్లు అనుభవించారు. ఆయన ఇంటిపై పోలీసులు దాడులు చేశారు... అక్రమంగా 23 కేసులు పెట్టారు. అయినా భయపడలేదు." అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

### అన్నట్లుగానే నేడు గౌరవ సభకు వచ్చాను.

"చట్టసభలకు రావడం అరుదైన అవకాశం. ఎన్నుకున్న ప్రజలకు ఏం చేయాలో గుర్తుపెట్టుకోవాలి. గెలిచి వచ్చిన మనందరిపై పవిత్రమైన బాధ్యత ఉంది. చట్టసభల్లో సభ్యుల ప్రవర్తన సరిగా ఉండాలి. మనం మాట్లాడే విషయాలన్నీ రాష్ట్రమంతా చూస్తుంది. ఆనాడు మేము 23 మంది సభ్యులం...జనసేన, బీజేపీ సభ్యులు సభలో లేరు. ఇదే సభలో నేను కూడా ఎంతో బాధపడ్డాను. నన్నూ, నా కుటుంబం గురించి ఇష్టానుసారంగా మాట్లాడితే నిరసన వ్యక్తం చేసేందుకు మైక్ కూడా ఇవ్వలేదు. ఇది గౌరవ సభ కాదు..మీరు నాకు మైక్ కూడా ఇవ్వడం లేదని నేను చెప్పాను.

"నేను స్టేట్ మెంట్ ఇవ్వాలనుకున్నా....మీరు మైక్ ఇవ్వలేదు...అయినా నాకు బాధలేదు. మళ్లీ చెపుతున్నా ముఖ్యమంత్రిగానే సభకు వస్తాను...ఇది కౌరవసభ...గౌరవ సభ కాదు...ఇలాంటి సభలో ఉండనని చెబుతున్నా...నా అవమానం ప్రజలు అర్థం చేసుకుని నిండు మనసుతో ఆశీర్వదించాలని" అని చెప్పి 2022 నవంబర్ 19న సభ నుండి బయటకు వచ్చాను. ఇప్పుడు ప్రజలు, మీ అందరి ఆశీస్సులతో అసెంబ్లీలో సీఎంగా అడుగుపెట్టాను." అని సీఎం చంద్రబాబు తెలిపారు.

ఏ మహిళకూ అవమానం జరగనివ్వను

"నేను 9 సార్లు ఎమ్మెల్యేగా గెలిచాను...నాకొచ్చినన్ని అవకాశాలు తెలుగురాష్ట్రాల్లో ఎవరికీ రాలేదు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేశాను...15 ఏళ్లు ప్రతిపక్ష నేతగా పనిచేశాను. తిరుపతిలో నాపై బాంబు దాడి చేశారు...ఆరోజు కూడా నాకు కన్నీళ్లు రాలేదు. కానీ సభతో, రాజకీయాలతో సంబంధం లేని నా సతీమణిపై నీచంగా మాట్లాడారు. రాష్ట్రంలో గౌరవంగా బతికే ప్రతి ఆడబిడ్డపై సోషల్ మీడియాలో నీచంగా పోస్టులు పెట్టారు. ఎంతో మంది ఆడబిడ్డలు ఆ బాధ తట్టుకోలేక కన్నీళ్లు పెట్టుకున్నారు.

అలాంటి వ్యక్తులు, నేతలు, పార్టీ రాష్ట్రానికి అరిష్టమని ప్రజలు భావించి మమ్మల్ని గెలిపించారు. గతంలో నాకు, రాష్ట్రంలోని మహిళలకు జరిగిన అవమానం మరెవరికీ జరగనివ్వను. నా జీవితాంతం ప్రజలకు రుణపడి ఉంటాను. మళ్లీ జన్మంటూ ఉంటే తెలుగు గడ్డపై పుట్టి రుణం తీర్చుకుంటాను. ఎక్కడో అమెరికాలో ఉండేవాళ్లు వచ్చి మొన్నటి ఎన్నికల్లో ఓటేశారు. ఇతర రాష్ట్రాల్లో ఉపాధి కోసం వెళ్లిన పేదలు కూడా వచ్చి ఓటు వేశారు. ఏపీని కాపాడుకోవాలని ఎన్డీఏ ఇచ్చిన పిలుపుతో వచ్చారు. వారందరి రుణం తీర్చుకోవాలి. ఆ తరహా చర్చలకు, కార్యక్రమాలకు ఈ సభ వేదిక కావాలి" అని సీఎం చంద్రబాబు తెలిపారు.

### ప్రజలు ఇచ్చింది అధికారం కాదు...బాధ్యత

"2019 ఎన్నికల్లో మాకు 23 సీట్లు వచ్చాయి...నాకు బాధేసింది. 2019లో 23వ తేదీన ఫలితాలు వస్తే.... 23 సీట్లు వచ్చాయని ఎగతాళి చేశారు. ఇప్పుడు కూటమికి 164 సీట్లొచ్చాయి....విడదీసి కూడితే 11 వస్తుంది. రాజధాని కోసం 1136 రోజులు అమరావతిలో ఆడబిడ్డలు ఉద్యమం చేశారు. ఆ నెంబర్లు కలుపుకున్నా 11 వస్తుంది. నేడు వైసీపీ గెలిచింది 11 చోట్లమాత్రమే. పవన్ కల్యాణ్ ను అసెంబ్లీ గేటు కూడా తాకనివ్వమని పెద్ద పెద్ద డైలాగులు చెప్పారు. ఆయన పార్టీ అభ్యర్థులు 21 సీట్లలో పోటీ చేస్తే 21 గెలిచారు.

వై నాట్ 175 అన్నారు...ప్రజలు 11 సీట్లు ఇచ్చారు. ఎక్కడ తగ్గాలో కాదు...ఎక్కడ గెలవాలో అక్కడ గెలిచిన వ్యక్తి పవన్ కళ్యాణ్. ఇది 16వ శాసనసభ...నా జీవితంలో ఎప్పుడూ చూడని విధంగా 15వ సభ జరిగింది. జరిగిన పరిణామాలతో అది కౌరవ సభగా మనం భావించాం. 16వ సభను అత్యున్నత సభగా మనం నిర్వహించాలి. 24 గంటలూ మనం ప్రజలతో ఉండాలి. ప్రజలకు జవాబుదారీతనంతో ఉండాలి. ప్రజలు మనకు అధికారం ఇవ్వడం కాదు... రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలని ముఖ్యమైన బాధ్యత ఇచ్చారు." అని సీఎం చంద్రబాబు అన్నారు.

### రాజధాని కట్టాలి...పోలవరం పూర్తి చేయాలి

"ప్రజా జీవితాన్ని మార్చే శక్తి ప్రభుత్వ విధానాలకు ఉంటుంది. ఆ విధానాలకు రూపకల్పన చేసేది మన చట్టసభలే. భారతదేశంలో పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టారు. ఆయన ప్రవేశపెట్టిన సంస్కరణలను ఆదర్శంగా తీసుకుని ఉమ్మడి ఏపీలో అనేక సంస్కరణలు తీసుకొచ్చాం. 25 ఏళ్ల క్రితం తీసుకున్న నిర్ణయాల ప్రభావం మనకు కనపడుతోంది. హైదరాబాద్ నగరం బెస్ట్ సిటీగా ఉందంటే మనం తీసుకున్న నిర్ణయాలే కారణం. నేడు భారత్ ప్రపంచంలోనే 5వ ఆర్థిక వ్యవస్థగా ఉంది....మరో నాలుగైదేళ్లలో 3వ ఆర్థిక వ్యవస్థగా తయారవుతుంది. 2047 వికసిత భారత్ మన కల కావాలి. అందుకు అగుణంగా సభలో చర్చలు, నిర్ణయాలు, పాలసీలు రావాలి. సభలో దూషణలు, వెకిలి చేష్టలు లేకుండా హుందాగా ముందుకుపోవాలి.

16 సభలు గమనిస్తే టంగుటూరి ప్రకాశం పంతులు, మెటూరి హనుమంతురావు, ఎంజీ రంగా, కాళేశ్వరరావు, కాసాని వెంకటరత్నం లాంటి వారు శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు. ఎన్టీఆర్ చరిత్ర సృష్టించిన యుగ పురుషుడు..వారందరూ మనకు ఆదర్శం కావాలి. నేను కోరుకునేది ఒకటే...రాజ్యాంగస్ఫూర్తి నిలుస్తుందని, ప్రజా స్వామ్యాన్ని కాపాడతారని, ఈ సభ హుందాగా నడుస్తుందని నమ్ముతున్నాను. మనం రాజధాని కట్టుకోవాలి...పోలవరం పూర్తిచేసుకోవాలి.

నదుల అనుసంధానం చేసుకోవాలి...పెట్టుబడులు రావాలి...యువతకు ఉద్యోగాలు రావాలి. బడుగులకు న్యాయం చేయాలి. ఈ లక్ష్యాల సాధన కోసం సభను సజావుగా నడిపించుకోవాలి. మీ ఆధ్వర్యంలో జరిగే సభ ద్వారా ఏపీ ప్రపంచంలో నెంబర్ వన్‌గా ఉండేందుకు, పేదరికం లేని రాష్ట్రంగా తయారుచేసేందుకు, ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు అడుగులు పడాలని, ఆ తరహా చర్చలు సాగానలి కోరుకుంటున్నాను. సభను సమర్థవంతంగా నడిపేందుకు మీకు దేవుడు శక్తిని ఇవ్వాలని, మంచి ఆరోగ్యం ప్రసాదించాలని దేవుడిని వేడుకుంటున్నాను" అని సీఎం చంద్రబాబు నాయుడు శాసనసభలో అన్నారు.

## మాది ఉద్యోగులను వేధించే సర్కారు కాదు

(మొదటిపేజీ తరువాయి..)

వెంకటేశ్వర్లు, కె.ర మేష్ బాబు. రెవిన్యూ సంఘ నేతల వినతికి స్పందించిన మంత్రి సత్యప్రసాద్, ప్రభుత్వంతో చర్చించి సత్వర న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తమది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని స్పష్టం చేశారు. ఉద్యోగులను వేధించే ప్రభుత్వం పోయిందని వ్యాఖ్యానించారు.

# కలెక్టర్ల బదిలీలు

(మొదటిపేజీ తరువాయి..)

పనిచేసిన వేణుగోపాల్‌రెడ్డికి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. విశాఖ కలెక్టర్‌గా చేసిన మల్లికార్జున సీఎంఓ అదనపు కార్యదర్శి ధనంజయరెడ్డి ఆదేశాలు పాటించేవారన్న ఆరోపణలుండేవి. ఎంపి విజయసాయరెడ్డి, వైవి సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు వారి సిఫార్సులకు ప్రాధాన్యం ఇచ్చేవారన్న విమర్శలు కూడా ఉండేవి. అయితే ప్రభుత్వం మారిన తర్వాత ఆయన.. టీడీపీలో తన యాదవ సామాజికవర్గానికి చెందిన కీలక నేత సిఫారుసతో, మళ్లీ పోస్టింగ్ సంపాదించుకునేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. టీడీపీలోని సదరు నేత.. కులాభిమానంతో మల్లికార్జనను ప్రోత్సహించేవారన్న విమర్శలున్న విషయం తెలిసిందే. కాగా జగన్ హయాంలో ఆయన అదనపు కార్యదర్శిగా పనిచేసిన ధనంజయరెడ్డి వర్గీయురాలిగా ముద్ర పడ్డ ఒక మహిళా అధికారికి రాజధాని జిల్లా కలెక్టర్ ఇవ్వడం ఆశ్చర్యపరిచింది. గతంలో ఆమె మిషనర్‌గా పనిచేసిన సమయంలో, వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని కూడా ఖాతరు చేసేవారు కాదన్న విమర్శలుండేవి. ఆమెను అత్యంత కీలకమైన రాజధాని జిల్లా కలెక్టర్ ఇవ్వడం, అటు టీడీపీ వర్గాల్లోనూ విస్మయం వ్యక్తమవుతోంది.

గుంటూరు జిల్లా కలెక్టర్‌గా ఎస్. నాగలక్ష్మి

గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి జీఏడీకి రిపోర్టు చేయాలని ఆదేశం

విశాఖపట్నం కలెక్టర్ మల్లికార్జున బదిలీ

మల్లికార్జునను జీఏడీకి రిపోర్టు చేయాలని ఆదేశం

విశాఖ కలెక్టర్‌గా విశాఖ జేసీకి అదనపు బాధ్యతలు

అల్లూరి జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత బదిలీ

అల్లూరి జిల్లా కలెక్టర్‌గా దినేష్‌కుమార్ నియామకం

కాకినాడ జిల్లా కలెక్టర్‌గా సగిలి షణ్మోహన్

ఏలూరు జిల్లా కలెక్టర్‌గా కె.వెట్రి సెల్వి నియామకం

తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా పి.ప్రశాంతి

విజయనగరం జిల్లా కలెక్టర్‌గా బి.ఆర్. అంబేద్కర్

పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా సి.నాగరాణి

చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా సుమిత్‌కుమార్

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా జి.సృజన

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు బదిలీ

ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా తమీమ్ అన్సారియా

కర్నూలు జిల్లా కలెక్టర్‌గా రంజిత్ బాషా

బాపట్ల కలెక్టర్‌గా ఆ జిల్లా జేసీకి పూర్తి అదనపు బాధ్యతలు

3

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ ఆదివారం 23, జూన్ 2024

## సీఎం గారూ..
# ఎగ్జామ్స్ అభ్యర్థులకు న్యాయం చేయండి

- సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీష్ బహిరంగలేఖ

**హైదరాబాద్:** వివిధ గ్రూప్ పరీక్షలు, నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మాజీ మంత్రి హరీష్‌రావు డిమాండ్ చేశారు. ఆ మేరకు ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగలేఖ రాశారు. హరీష్‌రావు లేఖ పూర్తిపాఠమిది.



*శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారికి,*
*ముఖ్యమంత్రి,*
*తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం.*
*తేది 22.06.2024*

**విషయం: వివిధ గ్రూప్ ఎగ్జామ్స్ రాస్తున్న అభ్యర్థుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం - నిరుద్యోగులకు మీరు ఇచ్చిన హామీల అమలు గురించి...**

గ్రూప్స్ అభ్యర్థులు, నిరుద్యోగుల ఆందోళనను, ఆవే దనను ఈ ప్రభుత్వం అర్థం చేసుకుంటుందని, క్యాబినెట్ సమావేశంలో వారికి న్యాయం చేసేలా నిర్ణయాలు తీసు కుంటుందని ఎదురుచూశాం.

కానీ అందరి ఆశలు అడియాశలు చేసేలా, నిరాశలోకి నెట్టేసేలా గ్రూప్ అభ్యర్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు, సమస్యల గురించి ఎలాంటి చర్చ లేకుండా క్యాబినెట్ సమావేశం ముగించారు. ఉసూరుమనిపించారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి ఏడాదే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని మీరు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. నిరుద్యోగులకు నెలకు రూ.4,000 భృతి ఇస్తామని మాట ఇచ్చారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో వివిధ శాఖల్లో లక్షా 60 వేల ఉద్యోగాలు భర్తీ చేసినప్పటికీ, కాంగ్రెస్ పార్టీ అంతకన్నా ఎక్కువ ఉద్యోగాలు ఇస్తుందని నమ్మి మీకు ఓటేశారు.

మీరు అధికారంలోకి వచ్చి ఇప్పటికే ఆరు నెలలు దాటింది. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఇచ్చిన ఉద్యోగాలకు మీరు నియామక పత్రాలను ఇచ్చారు తప్ప కొత్తగా ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదు. మిమ్మల్ని నమ్మి అధికారంలోకి తీసుకొచ్చిన నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం రోడ్డున పడి అలమటించవలసిన పరిస్థితి తెచ్చారు. గ్రూప్ 1, డిఎస్సీ తదితర ఉద్యోగాల కోసం చేపట్టిన నియామక ప్రక్రియ కూడా ఉద్యోగార్థులకు చాలా ఇబ్బంది కరంగా మారింది.

కనీసం వారు చేస్తున్న విజ్ఞప్తిని వినే పరిస్థితిలో కూడా మీ ప్రభుత్వం లేకపోవడం శోచనీయం.

బాధ్యతగల ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉద్యోగార్థులకు సంబంధించిన కొన్ని కీలకమైన సమస్యలను, బాధలను, వినతులను మీ దృష్టికి తెస్తున్నాను. వెంటనే ఈ అంశాలపై దృష్టి పెట్టి తగు న్యాయం చేయాలని కోరుతున్నాను.

1.గతంలో మా ప్రభుత్వం ఉన్నప్పుడు 503 ఉద్యోగాల భర్తీ కోసం గ్రూప్ 1 నోటిఫికేషన్ ఇవ్వటం జరిగింది. మీరు వాటికి మరో అరవై ఉద్యోగాలు చేర్చి మొత్తం 563 ఉద్యోగాలతో కొత్త నోటిఫికేషన్ వేసారు. అభ్యర్థులు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు.

ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని మెయిన్స్‌కు 1 : 50 నిష్పత్తిలో కాకుండా, 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను అనుమతించాలని కోరుతున్నాను.

1: 100 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేయడం కొత్తేమీ కాదు. గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షకి 1:100 నిష్పత్తిలో ఎంపిక చేశారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిర్వహించిన గ్రూప్ 2 నోటిఫికేషన్‌లో 1:15 గా పేర్కొన్నప్పటికీ, తదనంతరం అభ్యర్థుల కోరిక మేరకు 1:100 నిష్పత్తిలో మెయిన్స్‌కి ఎంపిక చేశారు.

గ్రూప్ 1 పరీక్ష అనేది యు.పి.ఎస్.సి. మాదిరిగా ప్రతి సంవత్సరం ఉండదు. రాష్ట్ర స్థాయి సివిల్స్ పరీక్ష కావడం వల్ల ఆశావహుల సంఖ్య పెరిగింది.

1:100 నిష్పత్తిలో మెయిన్స్‌కి ఎంపిక చేయడం వల్ల తెలంగాణ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తాము కలలు కన్న గ్రూప్ 1 ఉద్యోగాలను సాధించే అవకాశాలు పెరుగుతాయి. దీనివల్ల ప్రభుత్వానికి వచ్చిన నష్టమేమీ లేదు.

నేడు ఉపముఖ్యమంత్రిగా మీ ప్రభుత్వంలో బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీ భట్టి విక్రమార్క గారు గతంలో కాంగ్రెస్ శాసన సభాపక్ష నాయకునిగా ఉన్నప్పుడు గ్రూప్ 1 మెయిన్స్‌కు 1 :100 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేయాలని అసెంబ్లీ వేదికగా డిమాండ్ చేసారు. ఇప్పుడు ఆ వైఖరి నుంచి కాంగ్రెస్ పార్టీ ఎందుకు తప్పుకుంటున్నదో అర్థం కావటం లేదు.

ఈరోజు మీరు అధికారంలో ఉన్నారు. గతంలో మీరు చేసిన డిమాండ్‌ను అమలు చేయగలిగే అవకాశం మీకిప్పుడు ఉంది కానీ ఎందుకు చేయలేకపోతున్నారు ? ప్రతిపక్షంలో ఉంటే ఒకమాట అధికారంలో ఉంటే వేరొకమాటగా ప్రవర్తించడం ఎందుకు? గతంలో మీరు ప్రకటించిన వైఖరికి కట్టుబడి మెయిన్స్‌కు 1:100 చొప్పున ఎంపిక చేసి ఉద్యోగార్థులకు తగిన న్యాయం చేయండి.

2. గ్రూప్ 2కు రెండు వేల ఉద్యోగాలు, గ్రూప్ 3 కి మూడు వేల ఉద్యోగాలు అదనంగా కలుపుతామని మీరు మాట ఇచ్చారు. ఆ మాటను నిలుపుకోవాలని కోరుతున్నాను.

3. పోటీ పరీక్షల మధ్య కాలవ్యవధి చాలా తక్కువ ఉండడం వల్ల అభ్యర్థులు ఇబ్బంది పడుతున్నారు. ఆందోళనకు గురవుతున్నారు. జూలై చివరి వరకు డీఎస్సీ పరీక్షలు ఉన్నాయి, ఆగస్టు 7, 8 తేదీల్లో గ్రూప్ 2 పరీక్ష ఉంది. ఏడు రోజుల గ్యాప్ మాత్రమే ఉన్నందున అభ్యర్థులు ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నామని అంటున్నారు. ఈ ఒత్తిడితోనే సంగీత అనే అమ్మాయి ఆత్మహత్య కూడా చేసుకుంది. కాబట్టి ఉద్యోగ నియామకాల పరీక్షల తేదీల మధ్య ఎక్కువ వ్యవధి ఉండేలా షెడ్యూల్ సవరించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

4. ప్రభుత్వంలోకి వచ్చిన ఏడాదిలోగానే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని, జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. పత్రికల్లో మొదటి పేజీ ప్రకటనలు ఇచ్చారు. ఆరు నెలలు దాటినా ఆ దిశగా అడుగులు పడలేదు. వెంటనే రెండు లక్షల ఉద్యోగాలు గుర్తించి జాబ్ క్యాలెండర్ ప్రకటించి తదనుగుణంగా నోటిఫికేషన్లను జారీ చేయాలని, కోరుతున్నాను.

5. మీరు అధికారం లోకి రాగానే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చేందుకు మొదటి క్యాబినెట్‌లోనే నిర్ణయం తీసుకుంటామని మీ మేనిఫెస్టోలో ఘనంగా ప్రకటించారు. 25 వేల టీచర్ పోస్టులలో డిఎస్సీ నోటిఫికేషన్ జారీ చేస్తామని నిరుద్యోగులను నమ్మించారు. కానీ ఆచరణలో అందుకు భిన్నంగా 11 వేల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చి మోసం చేశారు. మీరు మేనిఫెస్టోలో చెప్పిన దానికి కట్టుబడి మొత్తం ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేసే విధంగా మెగా డీఎస్సీ నిర్వహించాలని కోరుతున్నాను .

6, అదే విధంగా రాష్ట్రంలోని నిరుద్యోగులకు నెలకు 4000 రూపాయల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారు. మీరు అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటివరకున్న బకాయి మొత్తం సహా నిరుద్యోగ భృతిని నెలనెలా చెల్లించాలని కోరుతున్నాను.

7, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే జీవో నెంబర్ 46 రద్దు చేస్తామని నిరుద్యోగులను నమ్మించారు. కానీ అధికారంలోకి వచ్చినంక వారిని నట్టేటముంచి జి.వో 46ప్రకారమే నియామక ప్రక్రియ పూర్తిచేశారు. నిరుద్యోగుల పట్ల కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి ఇది మరో నిదర్శనం. ప్రభుత్వం వెంటనే జీవో 46 ద్వారా ఏర్పడ్డ సమస్యలను పరిష్కరించి అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరుతున్నాము.

నిరుద్యోగ యువతకు మీరు ఇచ్చిన వాగ్దానాలను గుర్తుచేసేందుకు, తద్వారా వారి ప్రయోజనాలను కాపాడేందుకు నేను రాసిన ఈ లేఖను సహృదయంతో అర్థం చేసుకొని వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరిస్తారని నమ్ముతున్నాను.

**- తన్నీరు హరీశ్ రావు,**
**సిద్దిపేట శాసన సభ్యులు**

# నేను పార్టీ మారను

- నాకు కేసులు కొత్త కాదు
- జనగాం బీ ఆర్ ఎస్ ఎమ్మెల్యే, పల్లా రాజేశ్వర్ రెడ్డి

**వర్జీనియా:** కక్షపూరిత రాజకీయాలు తెలంగాణలో ప్రారంభించారని జనగాం ఎమ్మెల్యే, బీ ఆర్ ఎస్ నాయకుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. ఇప్పటిదాకా ఇలాంటి వాతావరణం తెలంగాణలో లేదు అన్నారు. బీ ఆర్ ఎస్ పార్టీ వీడే ప్రసక్తే లేదు అన్నారు.

ఈ విషయం సీఎం రేవంత్ రెడ్డికి కూడా తెలుసన్నారు. ఉద్యమం నుంచి రాజకీయాలలోకి వచ్చాను. ఉద్యమంలో అరెస్ట్ అయ్యాను.. నేను పార్టీ మారను అని ప్రకటించారు. అమెరికాలోని వర్జీనియాలో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా పాల్గొన్నారు. రాజకీయాల్లో విలువలు పాటించాలి.. గెలిచిన పార్టీలో ఐదేళ్లు ఉండాలి అన్నారు. పార్టీ మారాలి అని నాపై ప్రభుత్వం ఒత్తిడి చేస్తున్నారు. ఆరు నెలల్లో నాలుగైదు కేసులు నమోదయ్యాయి. విచారణ పేరుతో కమిటీలు వేశారు. నాతోపాటు భార్య నీలిమ, కొడుకు అనురాగ్ పై కూడా కేసులు పెట్టారు. వాటికి భయపడను. ఎదుర్కొంటూ పోరాడత.

బీఆర్ఎస్‌లోకి రాక ముందు జేఏసీ తో కలిసి తెలంగాణ కోసం పనిచేశా, అప్పుడు కేసులు నమోదయ్యాయి.. మళ్లీ ఇప్పుడు పెడుతున్నారు. నాకు కేసులు కొత్త కాదు అన్నారు పల్లా. కాళేశ్వరం అద్భుత ప్రాజెక్ట్. నిపుణుల సలహాతో అక్కడ కట్టారు. అవగాహన లేమితో కొందరు మాట్లాడుతున్నారు. అనేక రిజర్వాయర్ లలో కాళేశ్వరం ఒకటి.

అనేక మంది కాంట్రాక్ట ర్లు ప్రాజెక్టులో నిమగ్నం అయ్యారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి కాంగ్రెస్ వచ్చింది.. ఈ విషయం ప్రజలకు అర్థం అవుతుంది ఇప్పుడిప్పుడే అన్నారు. కెసిఆర్ కి శ్వాస, ధ్యాస తెలంగాణే అన్నారు పల్లా. తెలంగాణ తలెత్తుకొని నిలబడేలా కెసిఆర్ చేశారు అన్నారు.

ఇక్కడి యూనివర్సిటీల నుంచి మనం నేర్చుకోవాల్సింది



ఉందన్నారు. మౌలిక సదుపాయాలు, పరిశోధన లాంటి అంశాల్లో ఆదర్శం అన్నారు. మన స్టూడెంట్స్ స్ట్రాంగ్... అందుకే 30 శాతం మంది ఇండియా వాళ్ళే ఉంటారు. అందులోనూ తెలుగు వాళ్ళే ఉంటారు. ఇటు విద్యా.. అటు ఉద్యోగం విషయాల్లో మన వాళ్ళ పైనే విదేశీ యూనివర్సిటీలు ఆధార పడుతున్నాయి. ఇది మనందరికీ గర్వకారణం అన్నారు.

ఆటా ఎలెక్ట్ ప్రెసిడెంట్ జయంత్ చల్లా, ఆటా గత ప్రెసిడెంట్ లు భువనే శ్ భుజాల, రామ్మోహన్ కొండ, gta చైర్మన్ కలవల విశ్వేశ్వర రెడ్డి, రవి పల్లా, స్థానిక తెలుగు సంఘాలు మీట్ అండ్ గ్రీట్‌లో పాల్గొన్నారు.



## స్కిల్ డెవలప్మెంట్ సెంటర్
# ఏర్పాటుకు బడ్జెట్ కేటాయించాలి

- తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క

**ఢిల్లీ:** కేంద్ర ప్రాయోజిత పథకాల లో కొంత వెసులుబాటు కల్పించాలి. ఆయా రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా నిధులు ఉపయోగించుకునే అవకాశం ఇవ్వాలి. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు కు బడ్జెట్ కేటాయించాలి.

సమాజంలో అసమానతలు తగ్గించేందుకు సమ్మిళిత అభివృద్ధి చేయాలి. సెస్, సర్ ఛార్జ్ పన్నులు పది శాతం మించకుండా చేయాలి. రాష్ట్రాల నికర రుణపరిమితి సీలింగ్ ముందుగానే చెపితే దానికి అనుగుణంగా బడ్జెట్ పెట్టుకుంటాం. జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయింపులు ఉండాలి. కేంద్ర ప్రాయోజిత పథకాల కింద గత ఏడాది తెలంగాణకు 1.4 శాతమే నిధులు వచ్చాయి.ఉపాధి



హామీ నిధులు ఆస్తుల సృష్టి పనులకి వినియోగించేలా అనుమతులు ఇవ్వాలి. మూసీ రివర్ ఫ్రంట్‌కు నిధులు కేటాయించాలని కోరా. హైదరాబాద్ గ్లోబల్ సిటి అభివృద్ధికి నిధులు ఇవ్వాలి. అంతర్గత వనరులు సమీకరించుకుని మేము రుణమాఫీ చేస్తాం. బొగ్గు వేలంపై బిఆర్ఎస్ నేతలు మొసలి కన్నీరు కారుస్తున్నారు. వారి వల్లే బొగ్గు వేలం చట్టం వచ్చింది. బొగ్గు వేలం ఆపితే ఇల్లందు, సత్తుపల్లి గనులు ఎందుకు పోయాయి. సింగరేణికి నష్టం జరిగేలా , తమ సొంత వారికీ గనులు వచ్చేలా బిఆర్ఎస్ అధిష్టానం వ్యవహరించింది.

# జగన్.. ఆ యప్ప ఇక మారడప్పా!

- తలపట్టుకుంటున్న వైసీపీ సీనియర్లు
- ఓటమి కారణాలపై విశ్లేషించే చాన్సివ్వని జగన్
- ఈవీఎంలే ఓడించారని చెబితేనే వింటున్న జగన్
- వాస్తవ విశ్లేషణలు వినేందుకు ఇష్టపడని వైనం
- ఓడినా ఇంకా సీఎం అన్న భ్రమలు
- సీనియర్ల గంటలపాటు వెయిటింగ్
- జగన్‌ను ఆయన ఎదుటే దులిపేసిన కడప సీనియర్ నేత
- అవినాష్, సురేష్‌కుమార్ వల్లే జిల్లాలో పార్టీ నాశనమంటూ ఫైర్
- ఆ ఎమ్మెల్సీని బుజ్జగించి పంపేసిన జగన్
- అధినేతలు మారరా?

(మార్తి సుబ్రహ్మణ్యం)

ఏ పార్టీ అయినా ఎన్నికల్లో ఎందుకు ఓడిందో సమీక్షించుకుంటుంది. తమ తప్పులు తెలుసుకునేపనిలో ఉంటుంది. ఏ అంశాలు తమను దెబ్బతీశాయో ఆరా తీస్తుంది. ఏ వర్గం ఓటరు తమకు ఎందుకు ఓటువే యలేదో అన్వేషిస్తుంది. ఆ క్రమంలో సీనియర్ల వాదనలకు అవకాశం ఇస్తుంది. కానీ వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి మాత్రం అందుకు భిన్నం. ఆయన తాను పట్టుకున్న కుందేలుకు మూడే కాళ్లు! ఆయన ఏది చెబితే నేతలు ఆయన వాదనను అనుసరించాలి. దానితో "ఇక ఆ యప్ప ఇంక మారడప్పా" అని వైకాపేయులు ఫిక్సవుతున్న పరిస్థితి.

ఓటమి తర్వాత జిల్లా నేతలను కలుస్తున్న జగన్.. ఓటమి కారణాలు వినేందుకు ఇష్టపడకపోవడంపై వైకాపా నేతల్లో నిరాశ వ్యక్తమవుతోంది. మనం ఎక్కడ దెబ్బతిన్నామన్నా అని అడుగుతున్న జగన్.. 'ప్రతి ఒక్కరికీ ఎంతో మేలుచేసినా మనం ఓడిపోవడం ఏంటో నమ్మబుద్ధికావడం లేదు. ఈవీఎంలో మోసం జరిగిందనుకుంటున్నా. అట్లాగని మనం గట్టిగా మాట్లాడేందుకు మన దగ్గర ఆధారాలేమీలేవు' అని వ్యాఖ్యానిస్తున్నారట.

దానితో జగన్ మనస్తత్వం గ్రహించిన నేతలు.. "అవునన్నా.. పోలింగ్ తర్వాత మనం ఎవరిని అడిగినా మీకే ఓటేశామంటున్నారు. కానీ ఎందుకు ఓడిపోయామో మాకూ అర్థం కావడం లేదు. టీడీపీ,జనసేనతో బీజేపీ కుమ్మక్కయి ఈవీఎంలు మార్చింది. లేకపోతే పేదలకు ఇంతచేసిన మనం ఎట్లా ఓడిపోతాం" అని కోరస్ ఇచ్చి, జగన్‌ను మెప్పించేలా మాట్లాడుతున్నట్లు తెలుస్తోంది.

ఈ భజనగానం సీనియర్లకు ఏమాత్రం రుచించడం లేదట. ఆ ప్రకారంగా రెండురోజుల క్రితం.. కడప జిల్లా బద్వేలు సీనియర్ నేత ఒకరు, జగన్ తీరుపై ఆయన ఎదుటే విమర్శనాస్త్రాలు సంధించిన నేపథ్యంలో, అక్కడి నేతలు ఆయనను బుజ్జగించి బయటకు తీసుకువచ్చారట.

'నేను ఈ పార్టీకి సీనియర్ లీడర్‌ను. గంటసేపటి నుంచి బయట వెయిట్ చేస్తున్నా. నాతో ఎమ్మెల్యే కూడా వచ్చింది. అపాయింట్‌మెంట్ తీసుకునే మీ వద్దకు వచ్చాం. ఓడినా జగన్ ఇక మారడా' అని జగన్ సిబ్బందిపై విరుచుకుపడినట్లు సమాచారం. దానితో లోపల అవినాష్‌రెడ్డి-సురేష్‌కుమార్ ఉన్నారని, వారందరితో కలసి మీటింగ్ పెడాదమనుకున్నట్లు చెప్పడంతో ఆ నేత అగ్గిరాముడయ్యారట. 'అసలు జిల్లాలో పార్టీని నాశనం చేసిందే వాళ్లు. వాళ్ల వల్లే పార్టీ నాశనం అయింది. మేం వాళ్లతో కలసి కూర్చోవాలా" అని ప్రశ్నించినట్లు తెలిసింది. సదరు నేతను బుజ్జగించిన జగన్ సిబ్బంది, తర్వాత లోపలకు పంపించారట.

అక్కడ కూడా ఆయన జగన్ తీరుపై బాహాటంగానే అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఓటమి కారణాలు విశ్లేషించకుండా.. అందరూ ఈవీఎంలపై నెపం వేయడంతో, సదరు నేత సీరియస్ అయ్యారట. "మీరు ఇంకా మారకపోతే నష్టంపోతాం సార్. నేను, ఎమ్మెల్యే గంటసేపు నుంచి బయట వెయిట్ చేస్తుంటే ఇక్కడ మీరు పార్టీని నాశనం చేసినవాళ్లతో మాట్లాడటం ఏం బాగోలేదు. ఓటమికి కారణాలపై కిందిస్థాయి కార్యకర్తలతో మాట్లాడితే రిజల్టు వస్తాయి. ముందు మనం నేతలను గౌరవించడం నేర్చుకోవాల'ని ఊగిపోవడంతో, జగన్ హతాశుడయి.. అది కాదన్నా అని సర్దిచెప్పే ప్రయత్నం



చేశారట. ఈలోగా అక్కడున్న వారు, ఆయనను బుజ్జగించి బయటకు పంపించినట్లు తెలుస్తోంది.

ఓడిపోయినప్పటికీ జగన్ అపాయింట్‌మెంట్ తీరు, ఇంకా అవమానకరంగానే ఉందని సీనియర్లు చెబుతున్నారు. ఒకవైపు జగన్ సిబ్బందేమో సార్ దగ్గరకు ఎవరైనా రావచ్చని చెబుతుంటే, తీరా అక్కడికి వెళ్లిన తర్వాత మాత్రం, ఇంకా ఆయన పాత అవమానించే విధానమే అమలుచేస్తున్నారని మండిపడుతున్నారు.

"ఓటమికి కారణాలను ముందే ఈవీఎంలపై నె ట్టేస్తే, ఇక నేతలు క్షేత్రస్థాయి వాస్తవాలు ఎలా చెబుతారు? వాటిని వినడం ఇష్టం లేన్నట్లు జగన్ కూడా వ్యవహరిస్తున్నారు. ముఖమంతా అదోలా పెడుతున్నారు. అదే తప్పంతా ఈవీఎంలదే అని చెబితేనే సంతృప్తి చెందుతున్నారు. ఇక అలాంటప్పుడు మాలాంటి వాళ్లు అంతదూరం వెళ్లి నిజాలు చెప్పడం దండగనే కదా" అని సీనియర్లు వాపోతున్నారు.

సో.. ఇప్పుడు ఏ పార్టీ అధినేత కూడా మారేందుకు సిద్ధంగా లేరు. తమకు అనుగుణంగా అందరూ మారాలనుకుంటున్నారే తప్ప.. క్యాడర్-లీడర్ల మనోభావాల ప్రకారం నడుచుకోవాలని ఆలోచించడం లేదని స్పష్టమవుతుంది.

"ఒకసారి వారిమాట వినడం మొదలుపెడితే, తమ ఆలోచనలు ఎక్కడ దెబ్బతింటాయోనన్న భయమే దానికి కారణం. ఇక అందరూ సలహాలివ్వడం మొదలుపెడితే తాము వినేవాళ్లుగా-వాళ్లు చెప్పేవారిగా మిగిలిపోతామన్న మరో భయం కూడా లేకపోలేదు. అధికారం రాకపోయినా ఫర్వాలేదనుకుంటారే తప్ప, ఏ పార్టీ అధినేత కూడా మారరు" అని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడొకరు వివరించారు.

"జగన్ జగమొండి అని అందరికీ తెలుసు. అసలు ఆయనకు చెప్పడమే సాహసం. కానీ చంద్రబాబు అలాకాదు. ప్రజాస్వామ్యవాదిగా కనిపిస్తారు. అందరు చెప్పేది వింటారు. అందులో బాగున్న వాటిని అమలు చేస్తారు.ఎన్నికల ముందు అభ్యర్థుల ఎంపిక, క్యాబినెట్ కూర్పునకు ముందు బాబు, సీనియర్లు-పొలిట్‌బ్యూరో సభ్యులతో చర్చించి నిర్ణయం తీసుకునేవారు. పదవులు రాని వారిని పిలిచి మాట్లాడి, ఏ కారణంతో పదవి ఇవ్వలేకపోయామన్నది వారికి నచ్చచెప్పేవారు. దానితో అసంతృప్తితో వచ్చిన వారు సంతృప్తితో వె ళ్లేవారు. ఇది ఒకప్పుడు ఉండేది. ఇప్పుడు ఆయన కూడా మారినట్లు కనిపిస్తోంది. మంత్రి పదవులు ఆశించి నిరాశకు గురైన వారిని ఈసారి పిలిచి మాట్లాడినట్లు లేదు. అభ్యర్థుల ఎంపిక ముందు కూడా పొలిట్‌బ్యూరోల చర్చించినట్లు లేదు. బహుశా ఇకపై ఇదే పంథా టీడీపీలో కొనసాగే అవకాశం కనిపిస్తోంది. తరం మారటం కూడా దానికో కారణం" అని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడొకరు వివరించారు.

4

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ ఆదివారం 23, జూన్ 2024

# వైసీపీ కోవర్టులను కీలక బాధ్యత నుంచి తొలగించండి

- ముఖ్యమంత్రిని కలిసి వివరాలు అందజేసిన బ్రాహ్మణ చైతన్య వేదిక నేత సిరిపురపు శ్రీధర్‌శర్మ

**అమరావతి,మహానాడు:**

దేవదాయ శాఖలో వైసీపీ కోవర్టులను ఏరివేయాలని టీడీపీ నేత, బ్రాహ్మణ చైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు, బ్రాహ్మణ కార్పోరేషన్ మాజీ డైరక్టర్ సిరిపురపు శ్రీధర్‌శర్మ సీఎం చంద్రబాబు నాయుడును కోరారు.

బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ ఆధ్వర్యంలో శనివారం ముఖ్యమంత్రి నార చంద్రబాబు నాయుడును కలిసి దేవాదాయశాఖతో పాటు మిగిలిన కొన్ని శాఖల అవినీతి అధికారులు, వైసీపీ కోవర్ట్ అధికారుల వివరాల లిస్టు అందజేసి వైసీపీ ప్రభుత్వంలో ప్రజలను టిడిపి నేతలని శ్రేణులను వేధించిన కొంతమంది అధికారులు మళ్లీ టిడిపి ప్రభుత్వంలో కీలక బాధ్యతలు స్వీకరించడానికి పైరవీలు ప్రారంభించారని దీని పట్ల ప్రభుత్వం జాగ్రత్త వహించాల్సిందిగా శ్రీధర్ చంద్రబాబుకు విన్నవించారు.

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ అవినీతి అధికారులు వైసిపి కోవర్ట్ అధికారులు సిబ్బంది ఎవరెవరున్నారు అనేది జిల్లాల వారీగా, వివిధ శాఖల ప్రధాన కార్యాలయాల్లో సేకరిస్తున్నట్లు వారిపై ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం



చేశారు. ఈ కార్యక్రమంలో అమరావతి జేఏసీ నాయకులు పువ్వాడ సుధాకర్, ఎండపల్లి శబరి, వంగవీటి చైతన్య, నంది వెలుగు చందు తదితరులు పాల్గొన్నారు.

# రూ.4.50 లక్షల కోట్లతో వ్యవసాయానికి కేసీఆర్ పెద్దపీట

- హామీల అమలులో కాంగ్రెస్ విఫలం
- పథకాల అమలు చేతకాక కాంగ్రెస్ ప్రభుత్వం కుంటిసాకులు
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, పాల్గొన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డి, పాలకుర్తి బీఆర్ఎస్ నేత పల్లా సుందర్ రాంరెడ్డి

**హైదరాబాద్, మహానాడు:**

రూ.31 వేల కోట్లలో ఒక్క రూపాయి రుణమాఫీ చేయకుండానే దానిని పెద్దా సాయంగా రేవంత్ ప్రభుత్వం బూతద్దంలో చూపుతుంది.క్యాబినెట్ చర్చ కాగానే రుణమాఫీ చేసినట్లు ఒక సెక్షన్ మీడియా చిత్రీకరిస్తున్నది. పిల్ల పుట్టక ముందే మీడియా కుల్లకుడుతుంది.

ఏడు నెలల తర్వాత చర్చ జరిగినందుకు సిగ్గుపడాలి .. దాని గురించి మీడియా వార్తలు రాయాలి.ఆలు లేదు చూలు లేదు .. కొడుకు పేరు సోమలింగం అన్నట్లు మీడియా తీరు ఉంది. బీఆర్ఎస్ పాలనలో ఒక్క రోజు ఆలస్యమైతే మీడియా, మేధావులు ఒంటి కాలి మీద లేచేవారు. రైతాంగం ఉసురుపోసుకుంటున్నా ఇప్పుడు మేధావులు నోరెత్తడం లేదు .. మీడియా ప్రభుత్వానికి మద్దతు పలుకుతుంది.

డిసెంబరు 9 రుణమాఫీ అని చెప్పి ..హోల్ సేల్ గా 70 లక్షల మంది రైతులను కాంగ్రెస్ మోసం చేసింది.రూ.2 లక్షల రుణమాఫీ వట్టి బోగస్ .. 5 ఎకరాల వరకు ఉన్న రైతులకు రుణమాఫీ అంటున్నారు. 5 ఎకరాలు ఉన్న వారికి రూ.2 లక్షల రుణం ఏ బ్యాంకు ఇవ్వదన్న విషయం తెలియదా? అసలు ఏ క్యాటగిరీ, ఏ ప్రాతిపదికన రుణమాఫీ చేస్తుందో ప్రభుత్వం వివరాలు విడుదల చేయాలి.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం. రైతాంగాన్ని దారుణంగా మోసం చేస్తున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు సీజన్లు అయిపోయింది. ఎన్నికల ప్రచారంలో కేసీఆర్ ను స్థాయికి మించి దుర్భాషలాడారు. రైతుబంధు రెండు పంటలకు కాదు మూడు పంటలకు ఇస్తానన్నాడు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎకరాకు రూ.15 వేలు కాదు, పాత రూ.10 వేలు రైతుబంధు కు కూడా గతిలేదు.

రైతుల గొంతు కోసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్దమయింది. ఏరొక్క పౌర్ణమి నాటికి నదులు పారాలి. పుణ్యాత్ములు అడుగు పెట్టిన కాలమహిమో ఏమో ఇంత వరకు నీళ్లు రాలేదు.రైతు భరోసా మార్గదర్శకాల కోసం జులై 15 వరకు గడువు పెట్టుకున్నారు .. అప్పటికి వానాకాలం సగం అయిపోతుంది. పట్టాదారు పాస్ బుక్ ఉన్న ప్రతి రైతుకూ రైతుబంధు ఇచ్చాం.

కొండలు, గుట్టలకు రైతుబంధు ఇచ్చారని ఆరోపించారు. మరి ఇటీవల ఇచ్చాం అని చెప్పుకుంటున్న రైతుబంధు ఎందుకు ఇచ్చారు ? 68.99 లక్షల మంది రైతులకు బీఅర్ఎస్ పార్టీ 11 విడతల్లో రూ.72,815 కోట్లు ఒక్క రైతుబంధు కింద రైతుల ఖాతాల్లో జమ చేశాం. ఒక కోటి 52 లక్షల ఎకరాలకు రైతుబంధు వర్తింపచేశాం.




లోపాలను గత ఏడు నెలలలో కాంగ్రెస్ ఎందుకు సరిచేయలేదు ? ప్రతీ 5 వేల ఎకరాలకు ఒకటి చొప్పున రాష్ట్రంలో 2603 క్లస్టర్లు ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వ డాటా ఆధారంగానే కేంద్రం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన అమలు చేసింది. కొన్ని క్లస్టర్లను ఎంపిక చేసుకుని కలెక్టర్లతో రాండమ్ గా సర్వే చేస్తే ఒక్క రోజులో పూర్తవుతుంది.

ఆధునిక యుగంలో అన్ని అవకాశాలు ఉన్నా రైతులకు రైతుబంధు ఎగ్గొట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుటిల యత్నాలు చేస్తుంది. కొంతమందికి రుణమాఫీ చేసి, కొంత మందికి రైతుభరోసా ఇచ్చి మోసం చేసే ప్రయత్నం చేస్తుంది.భూ రికార్డుల శుద్ధీకరణ చేసి రైతులకు కొత్త పాస్ బుక్ లు ఇచ్చి కేసీఆర్ రైతుబంధు ఇచ్చారు.ఎక్కడైనా అనర్హులకు రైతుబంధు అంది ఉంటే ఈ పాటికి బయటపడేది .. సరిదిద్దుకునే తప్పులున్నా ప్రభుత్వం ఆ దిశగా ముందుకు సాగడం లేదు.

రంధ్రాన్వేషణలు చేస్తూ సర్కారు పథకాల అమలు ఎగ్గొడుతుంది.రైతుభీమా, ఉచిత కరంటు, పంటల కొనుగోళ్లు, విత్తనాలు, ఎరువుల సబ్సిడి, మైనర్ ఇరిగేషన్, కొత్త ప్రాజెక్టుల నిర్మాణంతో రైతాంగానికి అండగా నిలిచాం.తెలంగాణలో వ్యవసాయ రంగం అభివృద్దితో తెలంగాణ తలసరి ఆదాయం పెరిగి దేశానికి తోడ్పాటు అందించింది.

తెలంగాణలో 92.5 శాతం భూమి 5 ఎకరాల లోపు రైతుల వద్దనే ఉంది .. 5 నుండి 6 శాతం రైతుల వద్ద పది ఎకరాల వరకు భూమి ఉంది. 6488 మంది వద్ద భూపరిమితికి లోబడి భూమి ఉంది.రైతుబంధు అనేది రైతులు తమ భూమిని పడావు పెట్టకుండా సాగు చేయడం ద్వారా ఉత్పత్తి పెరిగి వ్యవసాయ అనుబంధ రంగాలకు ఊతంగా నిలుస్తుందన్న గొప్ప ఆలోచన ఉంది. దేశ సౌభాగ్యం పెంచే ఈ ఆలోచన దేశానికి మంచి చేయదా ? దానిమీద విషప్రచారం చేశారు. కొడంగల్‌లో నకిలీ విత్తనాలు, రైతుల ఆత్మహత్యలు, విత్తనాల కోసం రైతుల బారు వంటి వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. కాంగ్రెస్ పాత రోజులను మళ్లీ తీసుకు వస్తుంది.

# జగన్ కాన్వాయ్‌కి తృటిలో తప్పిన ప్రమాదం

**కడప,మహానాడు:**

జగన్ కాన్వాయ్‌కి తృటిలో ప్రమాదం తప్పింది. కడప విమానాశ్రయం నుంచి పులివెందులకు వెళ్ళుతుండగా రామరాజు పల్లి వద్ద కాన్వాయ్ లో వాహనాలు ఢీ కొన్నాయి. వాహన శ్రేణిలో ఇన్నోవా వాహనాన్ని ఫైర్ ఇంజన్ వాహనం ఢీకొంది. ఎవరికి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

# పోచారం లక్ష్మిపుత్రుడు కాదు.. లంక పుత్రుడు

- కాంగ్రెస్‌లో సిగ్గు లేకుండా చేర్చుకున్నారు
- పోచారం ఇపుడు పార్టీకి ద్రోహం చేశారు
- క్రషర్ కోసం వెళ్లారు
- దమ్ముంటే పోచారం రాజీనామా చేసి మళ్ళీ గెలవాలి
- రేపు రేవంత్ ను కూడా మోసం చేస్తారు
- మాజీ ఎమ్మెల్యేలు ఏ .జీవన్ రెడ్డి, గణేష్ బిగాల, డాక్టర్ మెతుకు ఆనంద్

**హైదరాబాద్, మహానాడు**

పోచారం శ్రీనివాస రెడ్డి లక్ష్మి పుత్రుడు కాదు లంక పుత్రుడుగా మారాడు. ఓఆర్ఎస్‌లో పోచారం అన్నీ పదవులు అనుభవించారు. పోచారం ఆయన కుటుంబ సభ్యులగురించి ఎన్నికల ప్రచారం లో చాలా నీచంగా మాట్లాడారు.

పోచారం గురించి అంతలా మాట్లాడిన రేవంత్ ఇపుడు కాంగ్రెస్ లో సిగ్గు లేకుండా చేర్చుకున్నారు. పోచారం తన నియోజక వర్గానికి 7500 కోట్ల రూపాయల నిధులు తీసుకెళ్లారు. రాష్ట్రం లోనే అత్యధికంగా డబుల్ బెడ్ రూం ఇండ్లు కేసీఆర్ బాన్సువాడ కు కేటాయించారు.

కేసీఆర్ రుణం తీర్చుకోలేనిది అన్న పోచారం ఇపుడు పార్టీకి ద్రోహం చేశారు. రైతుల కోసం పోచారం కాంగ్రెస్ లోకి వెళ్ళలేదు.. రాళ్ళ (క్రషర్ )కోసం వెళ్లారు. పోచారంకు కేసీఆర్ ఎంతో గౌరవం ఇచ్చారు. దమ్ముంటే పోచారం రాజీనామా చేసి మళ్ళీ గెలవాలి.

పార్టీ మారిన వాళ్ళను రాళ్లతో కొట్టాలని రేవంత్ రెడ్డి అన్నారు .ఆ మాటలు ఎక్కడకు పోయాయి. బాన్సువాడ లో ఉప ఎన్నిక తధ్యం .ఎపుడు ఎన్నిక జరిగినా బీ ఆర్ ఎస్




విజయం ఖాయం. చంద్రబాబు ,కేసీఆర్ లకు ద్రోహం చేసిన పోచారం రేపు రేవంత్ ను కూడా మోసం చేస్తారు.

**ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాల్సిందే: మాజీ ఎమ్మెల్యే గణేష్ బీగాల**

తల్లి పాలు తాగే వాళ్ళు టీఆర్ఎస్‌లో ఉంటారు ..డబ్బా పాలు తాగే వాళ్ళు టీడీపీలో ఉంటారు అని పోచారం గతం లో అన్నారు. అందరి కన్నా ఎక్కువ లబ్ధి పొందిన పోచారం పార్టీ మారడం దురదృష్టకరం. ఆయనకు బీఆర్ఎస్‌లో సీనియారిటీ కన్నా వయసు దృష్ట్యా పదవులు లభించాయి.

పోచారం చేసిన పనికి ఆయన్ను దేవుడు కూడా క్షమించడు. పోచారం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాల్సిందే. బీఆర్ఎస్‌లో నాయకులకు కొదవ లేదు. తెలంగాణ ప్రయోజనాల కోసం నిలబడే పార్టీ బీఆర్ఎస్ మాత్రమే. నలుగురు నాయకులు పోయినంత మాత్రాన బీఆర్ఎస్‌కు వచ్చిన నష్టం లేదు. మళ్ళీ అధికారంలోకి వచ్చేది బీఆర్ ఎస్ మాత్రమే.

# రాజకీయ సన్యాసమా? క్షమాపణలా?

- కొడాలి నాని తెల్చుకో
- టి.ఎన్.ఎస్.ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి పొట్లూరి దర్శిత్

**విజయవాడ, మహానాడు:**

చంద్రబాబు నాయుడు కుప్పంలో గెలిచినా, జగన్మోహన్ రెడ్డిని అధికారం నుంచి దించిన శాశ్వతంగా రాజకీయ సన్యాసం చేస్తానని సవాల్ చేసిన కొడాలి నాని మాట మీద నిలబడాలని టి.ఎన్.ఎస్.ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి పొట్లూరి దర్శిత్ డిమాండ్ చేశారు.

ఇటీవల మాజీ మంత్రి కొడాలి నాని మీడియా ముందు సీఎం నారా చంద్రబాబు నాయుడు పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ గురునానక్ కాలనీ లోని విజయవాడ పార్లమెంట్ కార్యాయలం, ఎన్టీఆర్ భవన్‌లో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు.

సవాల్ విసిరిన కొడాలి నాని మాట మీద నిలబడి రాజకీయ సన్యాసం చేసి, రాష్ట్రం విడిచిపోవాలి లేదంటే క్షమాపణలు చెప్పాలన్నారు. ఈ రెండు ఆప్షన్స్‌లో ఏదోకటి తెల్చుకోవాలని హెచ్చరించారు. అటు సవాల్‌లో, ఇటు ఎమ్మెల్యేగా ఓడిపోయిన కొడాలి నానికి ఇప్పుడు మీడియా ముందుకు వచ్చి మాట్లాడే హక్కు లేదని పేర్కొన్నారు.

కొడాలి నానికి టిడిపి హామీలు గురించి ప్రశ్నించే హక్కు, అర్హత రెండు లేవన్నారు. ఎమ్మెల్యేగా ఓడిపోయిన కొడాలి నానికి ఏమైనా సమస్యలు ఉంటే, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము వద్ద అర్జీ పెట్టుకోవాలని సూచించారు. ప్రతిపక్ష హోదా కూడా రాని పులివెందుల ఎమ్మెల్యే జగన్ మోహన్ రెడ్డికి ఏమైనా సమస్యలు వుంటే సీఎం నారా చంద్రబాబు నాయుడుకి అర్జీ పెట్టుకుంటే పరిశీలిస్తారని తెలిపారు.

వైసిపి నాయకులు దాడులు చేశారని మాట్లాడం చూస్తే దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లుగా వుందన్నారు.. గతంలో అనేకసార్లు వైసిపి నాయకులు టిడిపి కార్యకర్తలపై దాడులు చేశారు..వాటిని అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏనాడు ఖండించలేదు., పైగా జగన్మోహన్ రెడ్డి ఆ దాడులు



పై స్పందిస్తూ వైసిపి అభిమానులకు బిపి రావడం సహజమే అన్నాడు... ఓ ముఖ్యమంత్రి హోదాలో వుండి ఆ విధంగా సమర్థించుకోవటం ఆయనకే చెల్లిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏనాడు టిడిపి కార్యకర్తలను రెచ్చకొట్టే విధంగా మాట్లాడలేదు, ప్రోత్సహించలేదన్న విషయం గ్రహించాలన్నారు. తప్పు జరిగితే నిందితుల్ని శిక్షించే విషయంలో సీఎం చంద్రబాబు నిష్పాక్షపాతంగా వ్యవహరిస్తారని తెలిపారు.

మాట తప్పటం మడమ తిప్పటం జగన్ తో పాటు వైసిపి నాయకులకి బాగా అలవాటుగా మారిపోయిందన్నారు. అధికారంలో వున్నప్పుడు రిషికొండ ప్యాలెస్ జగన్ నివాసం వుండటానికి అని చెప్పి.. ఇప్పుడేమో టూరిజం కోసం కట్టించామని కొడాలి నాని చెప్పుకోవటం చూస్తే..ప్రజలకి వాళ్ల మోసపూరిత ఆలోచనలు అర్థమవుతున్నాయన్నారు..

టీడీపీ సర్కారులోనూ పనులు చేయించుకునేలా

# చెవిరెడ్డి భారీ స్కెచ్

- అసెంబ్లీలో క్యాటరింగ్ ద్వారా తన అనుచరులకు 5కోట్లు పాత బకాయిలు చెల్లించేలా దిమ్మతిరిగే ప్లాన్
- జగన్‌తో ఫుడ్ కాంట్రాక్టర్ తిలక్ ఏకాంత భేటీ

**అమరావతి మహానాడు:**

ఎమ్మెల్యేగా ఓత్ తీసుకుని అసెంబ్లీ నుంచి వెళ్లిపోతున్న జగన్ తో ఫుడ్ కాంట్రాక్టర్ తిలక్ జరిపిన ఏకాంత భేటీ అనేక అనుమానాలకు తావిస్తోంది. అసెంబ్లీకి వచ్చి తన పార్టీ ఎమ్మెల్యేలతో కూడా సరిగా మాట్లాడని జగన్... ఫుడ్ కాంట్రాక్టర్ తిలక్‌తో మాత్రం 5మినిట్స్ పైనే మాట్లాడటం చర్చనీయాంశంగా మారింది. అంతా మనం అనుకున్నట్లే జరుగుతోంది మళ్లీ వస్తే నన్ను మర్చిపోవద్దంటూ తిలక్ జగన్ తో దేనిని




ఉద్దేశించి అన్నాడో ఆలస్యంగా అందరికి అర్ధమవుతోంది.

టీడీపీ సానుభూతి పరుడు ముసుగులో వైసిపితొ అంతకాగుతూ. అసెంబ్లీలొ బోజనాల్ని పెట్టె కాంట్రాక్టర్ తిలక్ కు తెలివిగా చెవిరెడ్డి అప్పగించారు. గత తెలుగుదేశం ప్రభుత్వం లో తిలక్ చేపట్టిన భోజన కాంట్రాక్టు బిల్లుల చెల్లింపులో ఎన్నో ఆరోపణలు వచ్చాయి. ప్రభుత్వం మారాక మళ్లీ తిలకే భోజనం కాంట్రాక్టు తెచ్చుకుంటాడని ముందే పసిగట్టిన వైసీపీ పెద్దలు అతణ్ని ముందే లొంగతీసుకున్నారు.

చెవిరెడ్డి భాస్కరరెడ్డి ప్రధాస అనుచరుడైన ,తాడేపల్లి కృష్ణ రెడ్డి ద్వారా అతని అనుచరుడు మల్లికార్జునరెడ్డి ద్వార అసెంబ్లీ భోజనాల కాంట్రాక్టు తిలక్ ద్వారా నడిపే పన్నాగం పన్నారు. ఎవరికీ ఎలాంటి అనుమానం రాకుండా తిలక్ ద్వారా తమకు రావాల్సిన 5కోట్ల బకాయిలు రాబట్టుకోవటంతో పాటు తాము పంపే భోజనమే అసెంబ్లీలో సభ్యులు ఇతర సిబ్బందికి అందేలా పకడ్బందీగా స్కెచ్ వేశారు.

చెవిరెడ్డి భాస్కరరెడ్డి ప్రధాస అనుచరుడైన ,తాడేపల్లి కృష్ణ రెడ్డి తయారు చేసే భోజనం ఇప్పుడు మల్లికార్జునరెడ్డి ద్వారా తిలక్ కు చేరితే అతను అసెంబ్లీలో కాంట్రాక్టర్ గా ఫుడ్ సప్లై చేస్తాడు. తిలక్ చేసేదల్లా మినిస్టర్ లు ఎమ్మెల్యేలు వద్ద అతివినియం ప్రదర్శిస్తూ ఎక్కడా తన వెనుక ఉన్న వైసీపీ గ్యాంగ్ పై అనుమానం రాకుండా చేయటమే. ఇందుకు ఫుడ్ సప్లైయర్లు, సూపరువైజర్ల ముసుగులో వైసీపీ మనుషుల్ని పెద్దయెత్తునే అసెంబ్లీకి మోహరించేసుకున్నాడు.

ఎమ్మెల్యేలని సైతం గుర్తుపట్టకుండా వారిని ఇన్సల్ట్ చేస్తూ మంత్రులు కనిపిస్తే చాలు. ఎమ్మెల్యే చేతిలో ఉన్న ఖాళీ ప్లేటు సైతం లాగేసుకుని మంత్రికి ఇచ్చి 2రోజులు అతి వినయం బాగా చూపాడు. ఇష్టానుసారం బిల్లులు ఆమోదం చేపించుకునెందుకు మల్లిఖార్జున రెడ్డి ద్వారా క్రిష్ణరెడ్డి వ్యాపార సంస్థకు చేరేలా పక్కా స్కెచ్ అమలు చేస్తున్నాడు.

టీడీపీకి నిత్యం ఫుడ్ సప్లై చేసే కాంట్రాక్టర్లను కాదని, ఈ తిలక్‌ని ఎవరు తీసుకొచ్చారనే చర్చ టీడీపీ నేతల్లో జరుగుతోంది. టీడీపీ వాళ్లైతే నాకేంటి అసెంబ్లీలో నాదే ఇష్టారాజ్యం అంటూ అందరినీ అగౌరవ పరిచే తిలక్ వెనుక ఎవరు ఉన్నారని సీనియర్లు సైతం ఆశ్చర్య పోతున్నారట.

- జయకృష్ణ

5
జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 23, జూన్ 2024

# వైసీపీ కార్యాలయం పరిస్థితి ప్రశ్నార్థకం



**మచిలీపట్నం:**

కృష్ణాజిల్లా మచిలీపట్నం పోలీస్ పేరేడ్ గ్రౌండ్‌లో అధునాతన సదుపాయాలతో నిర్మాణం పూర్తి కావొచ్చిన వైసీపీ కార్యాలయం పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఇక్కడి మున్సిపాలిటీలో మూజువాణి ఓటుతో పోలీసు గ్రౌండ్ లోని రెండు ఎకరాల స్థలంలో వైసీపీ జిల్లా కార్యాలయ నిర్మాణం చేపట్టారు.

నిజానికి ఈ భూమి పోలీసు శాఖది. పోలీసు శాఖపై ఒత్తిడి తెచ్చి.. పురపాలక సంఘం పాలక మండలి అనుమతితో ఈ నిర్మాణం చేపట్టారు. ఈ భూమిపై నిజానికి పురపాలక సంఘానికి అధికారం లేదు. పైగా 99 తొమ్మిదేళ్ల లీజుకు ఇస్తూ పురపాలక సంఘం పాలక మండలి ఆమోదం తెలనటం అభ్యంతరకరమని అప్పట్లో టీడీపీ వాదించింది.

కానీ అధికార బలంతో ఈ భూమిని వైసీపీ స్వాధీనం చేసుకుంది. ఇదే స్థలంలో ప్రజలకు ఉపయోగపడే రీతిలో భోగరాజు సీతారామయ్య స్మారక భవన నిర్మాణానికి యూనియన్ బ్యాంకు ముందుకు వస్తే భూమి ఇవ్వలేదు. ఈ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఎంపీ బాలశౌరి కృషి చేశారు. కానీ బాలశౌరిపై వ్యతిరేకతతో అప్పటి ఎమ్మెల్యే పేర్నినాని అడ్డుకున్నారు. ఈ స్థితిలో బందరు పోలీసు పేరేడ్ గ్రౌండ్‌లో వెలిసిన వైసీపీ కార్యాలయంపై ప్రభుత్వం దృష్టి సారించినట్టు సమాచారం. ఎన్టీఆర్ సీఎం హయాంలో పోలీసు కుటుంబాల సంక్షేమం కోసం క్వార్టర్స్ నిర్మించారు. ఇవ్వన్నీ ఇప్పుడు శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రస్తుత స్థలంలో పోలీసుల క్వార్టర్స్ కట్టకపోతే పోనీ... కనీసం ఈ మైదానంపై వచ్చే ఆదాయంతో పోలీసు శాఖకు సంక్షేమ నిధికి ఊరట లభించేది.

# పొల్యూషన్ ఆడిట్
# కచ్చితంగా చేయాల్సిందే...

- ఏయే పరిశ్రమల నుంచి ఎంత కాలుష్యం విడుదలవుతుందో సమగ్ర నివేదిక ఇవ్వాలి
- కృష్ణా, గోదావరి నది జలాలు కలుషితంపై ప్రత్యేకంగా సమీక్షిస్తాము
- మన రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిపోయి నేపాల్ దేశంలో పట్టుబడ్డ ఎర్ర చందనాన్ని వెనక్కి తీసుకురావాలి
- కాలుష్య నియంత్రణ మండలి, అటవీ శాఖల ఉన్నతాధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశం



**అమరావతి, మహానాడు:**

రాష్ట్రంలో కాలుష్య నియంత్రణపై ప్రత్యేక డ్రైవ్ చేయాలని... అందులో భాగంగా పొల్యూషన్ ఆడిట్ కచ్చితంగా చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు.

ఏయే పరిశ్రమల నుంచి ఎంత కాలుష్యం విదలవుతుందో సమగ్ర నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. వరుసగా సమీక్షలు, అధికారులతో సమావేశాలు నిర్వహిస్తున్న పవన్ కళ్యాణ్ శాఖా పరమైన అంశాలపై దిశానిర్దేశం చేస్తున్నారు. శనివారం సాయంత్రం ఉప ముఖ్యమంత్రి నివాసంలో అటవీ శాఖ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎర్ర చందనం అక్రమ రవాణా అంశంతోపాటు పర్యావరణ సంబంధిత అంశాలు చర్చకు వచ్చాయి.

రాష్ట్రంలో పొల్యూషన్ ఆడిట్ విధానంపై చర్చించారు. ప్రతి జిల్లాలోని కాలుష్యం లెక్కలు తీయాలని, జల, వాయు కాలుష్యాల వివరాలు అందించాలని ఆదేశించారు. పరిశ్రమల వారీగా కాలుష్యం వివరాలు అందించి కాలుష్య నియంత్రణకు అనుసరించాల్సిన విధానాలు తెలపాలన్నారు. కృష్ణా, గోదావరి తీరాల్లో కాలుష్యం, కాగితపు పరిశ్రమల నుంచి వస్తున్న జల కాలుష్యంపైనా చర్చించారు. ఈ రెండు జీవ నదుల శుద్ధీకరణపైనా దృష్టి పెట్టాలని, ఈ అంశంపై కూలంకషంగా సమీక్షించాలని ఉప ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

### నేపాల్ దేశంలో 172 మెట్రిక్ టన్నుల ఎర్ర చందనం

ఎర్ర చందనం అక్రమ రవాణా అరికట్టడానికి టాస్క్ ఫోర్స్ ను బలోపేతం చేస్తామని తెలిపారు. ఇక్కడి నుంచి స్మగ్లర్లు తరలించిన ఎర్ర చందనం నేపాల్ దేశంలోని భద్రత సిబ్బందికి పట్టుబడిందనీ... ఆ ఎర్ర చందనం పరిమాణం 172 మెట్రిక్ టన్నులు అని అధికారులు వివరించారు. అక్కడ ఉన్న మన ఎర్ర చందనాన్ని ఇక్కడికి తీసుకువచ్చేందుకు తగు చర్యలు తీసుకోవాలని, దేశంలో ఇతర ప్రాంతాల్లో ఎక్కడెక్కడ ఎర్ర చందనం పట్టుబడి ఉందో కూడా తెలియచేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు.

# రైలు ప్రమాదంలో
# జబర్దస్త్ ఆర్టిస్ట్ దుర్మరణం



**కొత్తగూడెం:**

ముందుకు కదులుతున్న రైలెక్కేందుకు ప్రయత్నించిన ఓ టీవీ ఆర్టిస్టు తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మరణించాడు.

ఈ ఘటన శుక్రవారం కొత్త గూడెంలో చోటుచేసుకుంది. కొత్తగూడెం రైల్వే ఎస్సై సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. చుంచుపల్లి మండలం నందాతండాకు చెందిన మహ్మద్దీన్ (53) భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ కొత్తగూడెం,కు ఉదయం వచ్చారు.

అదే సమయంలో ముందు కు కదులుతున్న కాకతీయ ఎక్స్‌ప్రెస్‌ను ఎక్కేందుకు ప్రయత్నించారు. కిందకు జారిపడటంతో రైలు, ప్లాట్ ఫాం మధ్య ఇరుక్కుపోయాడు.

వెంటనే లోపలున్న ప్రయాణికులు చైన్‌లాగడంతో లోకో పైలెట్ రైలును ఆపారు. రైల్వే పోలీసులు సిబ్బంది సహాయంతో మహ్మద్దీన్‌ను బయటకు లాగి '108'లో కొత్తగూడెం జిల్లా సర్వజన ఆస్పత్రికి తరలించారు. నడుము, పక్కటెముకలకు తీవ్రగాయాలైన బాధితుడికి వైద్యులు అత్యవసర చికి త్స విభాగంలో సేవలందిం చారు. డా.రోషిణి సూచనలతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు ఖమ్మం తరలి. స్తుండగా మార్గం మధ్యలో అతడు మృతి చెందాడు.

మృతదేహాన్ని సర్వజన ఆస్పత్రి శవాల గదిలో భద్రపరిచారు. డ్యూటీ వైద్యురాలి ఫిర్యాదుతో స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. మహ్మద్దీన్ ఈటీవీ జబర్దస్త్‌లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా పని చేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 50 ఎపిసోడ్స్‌లలో పలు పాత్రలు పోషించారు. షూటింగ్ ఉందని చెప్పి శుక్రవారం హైదరాబాద్‌కు వెళ్లేందుకు ఉదయం స్టేషన్‌కు వచ్చారు.

ప్రమాదవశాత్తు మృత్యు వాతపడ్డారు. మృతుడికి భార్య, డిగ్రీ, పదోతరగతి చదివే ఇద్దరు కుమార్తె లున్నారు. మహ్మద్దీన్ మృతితో నందాతండాలో విషాదం అలుముకుంది. కళాకారుడిగా రాణిస్తూ కుమార్తెలు చదివించుకుంటున్న వ్యక్తి ప్రమాదవశాత్తు మరణించ డంపై స్థానికులు విచారం వ్యక్తం చేశారు

# అన్న క్యాంటీన్ నిర్వహణకు
# సీఎంకు రూ.లక్ష విరాళం



**అమరావతి:**

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో పునరుద్ధరించనున్న అన్న క్యాంటీన్ల నిర్వహణకు గుంటూరుకు చెందిన మర్రిపూడి సుష్మ అనే యువతి విరాళం అందించారు. సీఎం చంద్రబాబు నాయుడును సచివాలయంలో శుక్రవారం కలిసి లక్ష రూపాయల చెక్కు అందించారు.

గుంటూరు పట్టణం, వికాస్ నగర్ చెందిన సుష్మ యూఎస్ఏలో ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన అన్నక్యాంటీన్లను వైసీపీ ప్రభుత్వం మూసేసిందని...మళ్లీ టీడీపీ ప్రభుత్వం అన్నక్యాంటీన్లను పునరుద్ధరిస్తున్నందున ప్రభుత్వానికి తమ వంతుసాయంగా విరాళం అందించామని సుష్మ కుటుంబ సభ్యులు తెలిపారు. సుష్మతో పాటు ఆమె తల్లిదండ్రులు రాధా కృష్ణ, మంజువాణిని సీఎం చంద్రబాబు నాయుడు అభినందించారు.

# విద్యుత్ సంస్కరణలకు
# ఆద్యుడు చంద్రబాబు

- 40,336 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు దస్త్రంపై తొలి సంతకం
- ప్రభుత్వ కార్యాలయాలకు దశల వారీగా సోలార్ విద్యుత్ కనెక్షన్లకు రెండో సంతకం
- పియం సూర్యఘర్ పథకంలో ఇంటింటికి మూడు కిలోవాట్ల సోలార్ విద్యుత్ అందించే కార్యక్రమానికి మూడో సంతకం
- రాష్ట్రంలో విద్యుత్ డిమాండు సరఫరాపై ప్రత్యేక దృష్టి సారిస్తాం
- దేశంలోనే ఆదర్శవంతమైన విద్యుత్ శాఖగా ఎపిని తీర్చిదిద్దుతాం
- చంద్రబాబు తీసుకువచ్చినన్ని సంస్కరణలు దేశంలో మరెవరూ తీసుకురాలేదు
- రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



**అమరావతి,22 జూన్:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్తగా 40వేల 336 వ్యవసాయ విద్యుత్ కనక్షన్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దస్త్రంపై తొలి సంతకం చేశారు. ఈమేరకు శనివారం అమరావతి రాష్ట్ర సచివాలయంలో ఆయన వేద పండితుల ఆశీర్వచనాల మధ్య ఇంధనశాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా 40వేల 336 కొత్త వ్యవసాయ విద్యుత్ కనక్షన్లు మంజూరు చేస్తూ దస్త్రంపై తొలి సంతకం చేశారు.

అలాగే ప్రభుత్వ కార్యాలయాలకు దశలవారీగా సోలార్ విద్యుత్ కనెక్షన్ల మంజూరుకు సంబంధించిన దస్త్రంపై రెండో సంతకం చేశారు. అదే విధంగా ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో ఇంటింటికి మూడు కిలోవాట్ల సోలార్ విద్యుత్ అందించే కార్యక్రమానికి సంబంధించిన దస్త్రంపై మూడో సంతకం చేశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ తనకు విద్యుత్ శాఖ మంత్రిగా అవకాశం కల్పించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు



ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు పేర్కొన్నారు.

రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన రీతిలో విద్యుత్ ను అందించేందుకు విద్యుత్ సరఫరా డిమాండులపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని స్పష్టం చేశారు. దేశంలో విద్యుత్ సంస్కరణలకు ఆద్యుడు చంద్రబాబు నాయుడని ఆయన తీసుకు వచ్చినన్ని విద్యుత్ సంస్కరణలు మరెవరూ తీసుకురాలేదని అన్నారు.

దేశంలోనే ఉత్తమ విద్యుత్ శాఖగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ శాఖను తీర్చిదిద్దేందుకు అన్ని విధాలా ప్రయత్నం చేస్తానని విద్యుత్ శాఖామాత్యులు గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. విద్యుత్ శాఖ అధికారులు,సిబ్బంది సమన్వయంతో పనిచేసి విద్యుత్ శాఖ ద్వారా ప్రజలకు మెరుగైన



రీతిలో సేవలు అందించే విధంగా పనిచేయాలని మంత్రి రవికుమార్ ఆకాంక్షించారు.గత ప్రభుత్వం విద్యుత్ శాఖను



నిర్వీర్యం చేయడమే గాక 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై మోయలేని భారం మోపిందని ఆరోపించారు.

ఈ కార్యక్రమంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్,ఒంగోల్ ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి,బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్,బాపట్ల ఎమ్మెల్యే వి.నరేంద్ర వర్మ,పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్,పలువురు ఇతర ప్రజాప్రతినిధులు,ఇంధనశాఖ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రాకు నిధులిచ్చి ఆదుకోండి

- కేంద్ర ఆర్థికమంత్రి నిర్మతాసీతారామన్‌తో పయ్యావుల భేటీ
- ఆక్వా పార్కులు,టెక్స్ టైల్ పార్కులు, గ్రీన్ ఎనర్జీ కారిడార్ కు మద్దతు ఇవ్వండి



**ఢిల్లీ,మహానాడు:**

రాష్ట్రానికి ఏం కావాలి అనే అంశంపై కేంద్రానికి నివేదిక అందజేశానని... విభజన వల్ల వచ్చిన ఆర్థిక సవాళ్లను అధిగమించడానికి, గడిచిన 5 ఏళ్లలో ఆర్థిక పరమైన తప్పులను సరిదిద్దడానికి కేంద్ర సహకారం ఇవ్వాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కోరారు.

పోలవరం ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి కావడానికి సహకారం అందించాలని కోరామన్నారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ నేతృత్వంలో శనివారంజరిగిన ప్రీ బడ్జెట్, జీఎస్టీ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాల్లో పయ్యావుల పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పయ్యావుల మాట్లాడుతూ... అమరావతి నిర్మాణానికి సహకారం, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.పారిశ్రామిక రాయితీలు, పారిశ్రమిక కారిడార్ల ఏర్పాటుకు సహకారం ఇవ్వాలని, ఆక్వా పార్కులు, టెక్స్ టైల్ పార్కులు, గ్రీన్ ఎనర్జీ కారిడార్ కు మద్దతు కావాలని కోరామన్నారు. తిరుపతి వైజాగ్ ఎయిర్ పోర్ట్‌లకు రావాల్సిన రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని కోరామన్నారు. ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు సహకారం అందించాలని కోరామన్నారు. రైల్వే జోన్ ఆపరేషన్‌కు సహకారం ఇవ్వాలన్నారు.

రైల్వే జోన్ ఆపరేషన్ కు సహకారం అందించాలన్నారు. గ్రేహౌండ్స్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు సహకారమందిచాలన్నారు. కానీ కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన వాటి కోసం కృషి చేస్తామని తెలిపారు. చేనేత వస్త్రాలపై 5 శాతం పన్ను మినహాయింపు కోరినట్లు చెప్పారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
6
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 23, జూన్ 2024




## పవన్ దృష్టికి అసెంబ్లీ హౌస్ కీపింగ్
# సిబ్బంది సమస్యలు

అమరావతి,మహానాడు

రాష్ట్ర శాసన సభలో పని చేసే హౌస్ కీపింగ్ సిబ్బందిగా ఉన్న 154 మంది మహిళలు తమ సమస్యలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకు వెళ్లారు. గత ఎనిమిదేళ్లుగా ఇక్కడే పని చేస్తున్నామని, తాము అమరావతి ప్రాంత రైతు కూలీలమని తెలిపారు.

శాసనసభ రెండో రోజు స్పీకర్ ఎన్నిక సందర్భంగా సభకు ఉదయమే విచ్చేసిన పవన్ కళ్యాణ్ అసెంబ్లీ ప్రాంగణమంతా కలియ తిరిగి పరిశీలించారు.అక్కడున్న సిబ్బందితో, సెక్యూరిటీతో సరదాగా మాట్లాడుతూ వారితో మమేకమయ్యారు. సిబ్బందికి ఫొటోలు ఇచ్చి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ శాసనసభను పరిశీలించారు.

ఈ సందర్భంగా శాసనసభ హౌస్ కీపింగ్ సిబ్బంది పవన్ కళ్యాణ్‌కి తమ సమస్యలను చెప్పుకొన్నారు. ఈ సందర్భంగా హౌస్ కీపింగ్ సిబ్బంది మొత్తం అన్ని విభాగాల్లో కలిపి 154 మంది వరకు శాసనసభలో పనిచేస్తున్నామని, రాజధాని ప్రాంత రైతు కూలీలమని ఇక్కడ పనిచేస్తున్నారని చెప్పారు. 8 సంవత్సరాల కిందట రూ.6 వేలకు ఉద్యోగంలో చేరామని ఇప్పుడు రూ.10 వేలు ఇస్తున్నారన్నారు.

అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ పరిధిలో ఉన్నామని తెలిపారు. అమరావతి రైతు కూలీలుగా ఉన్నందున నెలకు రూ.2500 భత్యం వచ్చేదని.. తరవాతి రోజుల్లో కీపింగ్ ఉద్యోగం ఉందని చెప్పి ఆ భత్యం నిలిపివేశారన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని, ఉద్యోగ భద్రతను కల్పిస్తూ.. పురపాలక ఉద్యోగులుగా గుర్తించాలని వేడుకున్నారు. హౌస్ కీపింగ్ ఉద్యోగుల సమస్యను ఆసాంతం విన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందించారు. ముఖ్యమంత్రి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి, తగు విధంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.








శాసన సభ రెండవ రోజు శనివారం జరిగిన సమావేశంలో
వనమాడి వెంకటేశ్వరరావు,పితాని సత్యనారాయణ, జివి ఆంజనేయులు ప్రమాణ
స్వీకారోత్సవ కార్యక్రమ దృశ్యాలు



## రాజధానికి రూ.25 లక్షల విరాళం ఇచ్చిన
# వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి

- పొలం అమ్మి రాజధానికి విరాళం ఇచ్చిన వైష్ణవి స్ఫూర్తిని అభినందించిన సీఎం చంద్రబాబు
- రాజధాని అమరావతికి బ్రాండ్ అంబాసిడర్ గా వైష్ణవిని నియమించిన సిఎం చంద్రబాబు
- పోలవరం కోసం మరో రూ.1 లక్ష విరాళం ఇచ్చిన వైష్ణవిని ప్రశంసించిన ముఖ్యమంత్రి
- తండ్రితో కలిసి రెండు చెక్కులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేత

అమరావతి,మహానాడు:

ఆంధ్ర ప్రదేశ్ రాజధాని అమరావతి, రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి వైష్ణవి అనే వైద్య విద్యార్థిని విరాళం అందించారు. ఏలూరు జిల్లా, ముదినేపల్లికి చెందిన అంబుల వైష్ణవి శనివారం ఉండవల్లి నివాసంలో సీఎం చంద్రబాబు నాయుడుని శనివారం కలిసి విరాళం అందించారు. అమరావతి నిర్మాణానికి రూ.25 లక్షలు, పోలవరం ప్రాజెక్టుకు రూ.1 లక్ష చొప్పున విరాళం ఇస్తూ సీఎం చంద్రబాబుకు చెక్కు అందించారు.

తమకున్న మూడు ఎకరాల భూమిలో ఎకరా అమ్మగా వచ్చిన రూ.25 లక్షలను రాజధానికి, తన బంగారు గాజులు అమ్మగా వచ్చిన రూ.1 లక్షను పోలవరానికి విరాళంగా అందించినట్లు వైష్ణవి తెలిపారు. రాజధానిని నిర్మిద్దాం, రాష్ట్రాన్ని అభివృద్ధి చేద్దాం అనే ఆలోచనతో పనిచేస్తున్న ప్రభుత్వానికి తనవంతుగా ఈ విరాళం ఇచ్చినట్లు ఆమె తెలిపారు.

రాజధాని నిర్మాణం కోసం వైష్ణవి పొలం అమ్మి మరీ విరాళం ఇవ్వడం గొప్ప విషయం అని చంద్రబాబు అన్నారు. ప్రస్తుతం విద్యార్థిగానే ఉన్న వైష్ణవి....తండ్రి సహకారంతో రాజధాని కోసం, పోలవరం కోసం విరాళం ఇవ్వడం ఎంతో గొప్ప విషయం అన్నారు. నేటి యువతకు వైష్ణవి ఒక స్ఫూర్తిగా నిలుస్తుందని చంద్రబాబు అభిప్రాయ పడ్డారు. ఇలాంటి యువత కలలు తమ ప్రభుత్వం నిజం చేస్తుందని చంద్రబాబు అన్నారు.

ఎటువంటి లాభాపేక్షలేకుండా ఇంత చిన్న వయసులో ఇంత గొప్ప మనుసు చాటిని వైష్ణవిని సీఎం శాలువా కప్పి సత్కరించారు. స్ఫూర్తి దాయకంగా నిలిచిన వైష్ణవిని సీఎం అమరావతి కి బ్రాండ్ అంబాసిడర్ గా నియమిస్తున్నట్లు ప్రకటించారు. వైష్ణవి విజయవాడలోని ఓ మెడికల్ కాలేజ్ లో ప్రస్తుతం ఎంబిబిఎస్ సెకండ్ ఇయర్ చదువుతున్నారు. ఈ సందర్భంగా వైష్ణవితో పాటు, ఆమె తండ్రి అంబుల మనోజ్ ను సిఎం చంద్రబాబు అభినందించారు.




## బిసి సంక్షేమ శాఖ మంత్రి
# సవిత ఆకస్మిక తనిఖీ





విజయవాడ,21 జూన్,మహానాడు:

విజయవాడలోని విద్యుత్ కాలనీలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహాలను రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి హాస్టల్లో అందిస్తున్న భోజనం,హాస్టల్లోని మౌలిక సదుపాయాల ఎలా ఉన్నాయో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

హాస్టల్ పరిసరాలను భోజనశాల,వంట గదులను మంత్రి పరిశీలించారు. పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారు లను ఆదేశించారు. భోజనశాల, వంట గదులను ఆధునీకరిం చాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి భోజనం చేశారు.ఆహార పదార్థాల నాణ్యతపైని అరా తీశారు. విద్యార్థులు నిద్రించే రూములు వారు ఉపయోగించే మెరుగు దోడ్లు పరిశుభ్రంగా లేకపోవడంతో వార్డెన్ ను మంత్రి సవిత మందలించారు.

ఆహార పదార్థాల నాణ్యత, పరిమాణంపై విద్యార్థులను నేరుగా ఆడిగి తెల్సుకున్నారు. విద్యార్థులకు అందించే భోజనం నాణ్యత లేకపోవడంతో పైనా ఆగ్రహం వ్యక్తం చేసారు. పద్ధతి మార్చుకోవాలని వార్డెన్ ను మంత్రి హెచ్చరించారు.

అనంతరం విద్యార్థులతో మంత్రి సవిత మాట్లాడుతూ అందరూ బాగా చదువుకుని ఉన్న స్థాయికి ఎదగాలని ఆకాంక్షిం చారు. తదుపరి విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. వసతి గృహంలో ఏ సమస్య ఉన్న నేరుగా తనకు ఫోన్ చేయమని విద్యార్థులకు మంత్రి ఫోన్ నెంబర్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## 3.5 లక్షలకు పైగా కాన్సర్ బాధితులకు ఉత్తమ చికిత్స

- బసవతారకం ఇండో అమెరికన్ కాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ

హైదరాబాద్, మహానాడు:

మా అమ్మ గారు స్వర్గీయ బసవతారకం క్యాన్సర్ మహమ్మారి కారణంగా మరణించడంతో కలత చెందిన మా తండ్రి , మా కుటుంబంలో జరిగిన విషాదం మరో కుటుంబంలో జరగకూడని భావించి స్థాపించిన హాస్పిటల్ మా ఈ బసవ తారకం ఇండో అమెరికన్ కాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్.

ఆరోజు మా నాన్న మదిలో జన్మించిన ఆలోచనతో ప్రారంభమైన హాస్పిటల్ నేటికి 24 వసంతాలు పూర్తిచేసుకుంది, 650 పడకలతో, 1800 పైగా సిబ్బందితో, ఇప్పటి వరకు 3.5 లక్షలకు పైగా కాన్సర్ బాధితులకు ఉత్తమ చికిత్సని అందించటం జరిగింది.

క్యాన్సర్‌పై మా ఈ పోరాటంలో మాకు వెన్నుదన్నుగా నిలిచిన దాతలకు, నిపుణులైన వైద్య సిబ్బందికి,అంకితభావంగల సహాయ సిబ్బందికి, సహకరిస్తున్న ప్రభుత్వాలకు, అధికారులకు, అభిమానులకు, పేరు పేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు..



7

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 23, జూన్ 2024



## ప్రజల నుంచి వినతులు స్వీకరించిన సీఎం చంద్రబాబు

అమరావతి : సీఎం చంద్రబాబు నాయుడు శనివారం సాయంత్రం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి వెళ్లారు. ప్రతి శనివారం పార్టీ కార్యాలయానికి వెళ్లి కార్యకర్తలు, సామాన్య ప్రజలను కలిసేందుకు ఆయన సమయం ఇవ్వాలని గతంలోనే నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పార్టీ కార్యాలయానికి వచ్చిన చంద్రబాబును వందల మంది ప్రజలు, కార్యకర్తలు కలిసి వినతి పత్రాలు ఇచ్చారు. పార్టీ కార్యాలయం గేటు వద్ద నుంచి బారులు తీరి ఉన్న ప్రజల వద్దకు వెళ్లి చంద్రబాబు వినతులు స్వీకరించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో జరిగిన పార్లమెంటరీ పార్టీ మీటింగ్‌లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు.









## గుంటూరు జిల్లా కలెక్టర్‌గా ఎస్.నాగలక్ష్మి



**గుంటూరు, మహానాడు:**
గుంటూరు జిల్లా కలెక్టర్‌గా ఎస్ నాగలక్ష్మి ని నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. రాష్ట్ర వ్యాప్తంగా 18 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు గుంటూరు కలెక్టర్ గా పని చేసిన వేణుగోపాల్ రెడ్డిని జిఏడీలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. నూతన కలెక్టర్గా నియమితులైన నాగలక్ష్మి గతంలో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా పనిచేశారు.

## మూడోసారి ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన జీవీ ఆంజనేయులు

**అమరావతి, మహానాడు:**
సార్వత్రిక ఎన్నికల్లో అద్భుత విజయం అందుకున్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, వినుకొండ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు శనివారం అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్ర 16వ శాసనసభ సమావేశాల రెండో రోజు ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆయనతో ప్రమాణం చేయించారు. వినుకొండ నుంచి మూడోసారి గెలుపొంది అసెంబ్లీలో అడుగుపెట్టిన ఏకైక వ్యక్తిగా కూడా జీవీ ఆంజనేయులు ఈ సందర్భంగా అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. 2009లో తెలుగుదేశం పార్టీ తరఫున వినుకొండ నుంచి పోటీ చేసిన జీవీ భారీ ఆధిక్యంతో విజయం సాధించారు. తెలుగుదేశం పార్టీకి ఏకంగా 51.9శాతం ఓట్లు సాధించారు. తర్వాత 2014 ఎన్నికల్లో ముందు ఎన్నికల ఆధిక్యాన్ని తిరగరాస్తూ ఏకంగా 52.77శాతం ఓట్లతో గెలుపొందారు. మధ్యలో 2019లో ఓడిపోయినా 2024 ఎన్నికల్లో మళ్లీ ప్రభంజనం లాంటి విజయం అందుకున్నారు. 30వేలకు పైగా ఓట్ల ఆధిక్యంతో బొల్లా బ్రహ్మనాయుడిపై బదులు తీర్చుకున్నారు. వినుకొండ నియోజకవర్గంలోని



ఈపూరు మండలం ఇనుమెళ్ల గ్రామం వ్యవసాయ కుటుంబంలో జన్మించిన జీవీ ఆంజనేయులు.. బీఎస్సీ డిగ్రీ పూర్తి చేశారు. శనివారం అసెంబ్లీలో దైవసాక్షిగా ప్రమాణం చేసిన జీవీ బయటకు వచ్చిన అనంతరం మాట్లాడుతూ నవ్యాంధ్రప్రదేశ్ పునర్నిర్మాణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో పనిచేసే అద్భుత అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా అన్నారు. ఈ సదావకాశం ఇచ్చిన వినుకొండ నియోజకవర్గం ప్రజలు అందరికీ తన ప్రమాణ స్వీకారం సందర్భంగా కృతజ్ఞతాభివందనాలు తెలియజేస్తు న్నట్లు తెలిపారు.
ఎంతో నమ్మకంతో ప్రజలు ఇచ్చిన అవకాశం, అధికారం... ఆఖరిక్షణం వరకు వారికోసమే, వారితోనే అని మాటిస్తున్నా అన్నారు జీవీ ఆంజనేయులు.



## రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా పెట్టుకోవాలి

- అభివృద్ధి, రాష్ట్ర ప్రయోజనాలే పార్లమెంటు సభ్యుల ప్రథమ కర్తవ్యం
- విభజన హామీల అమలకు ఎంపీలు కృషి చేయాలి
- దేశంలోనే టాప్ 10 విశ్వవిద్యాలయాలు, ఆసుపత్రులు, పరిశ్రమలను తీసుకువచ్చేలా కృషి
- పార్లమెంటులో టీడీపీ ఎంపీలు అనుసరించాల్సిన విధివిధానాలపై చంద్రబాబు దిశానిర్దేశం
- టీడీపీ పార్లమెంటరి పార్టీ నేతగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు నియామకం

**అమరావతి,మహానాడు:**
రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పార్లమెంటు సభ్యులందరూ పని చేయాలని, స్ఫూర్తిదాయకంగా నిలవాలని తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు.
రాష్ట్ర ప్రయోజనాలే ఎంపీల ప్రథమ కర్తవ్యం కావాలని దిశానిర్దేశం చేశారు. శనివారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాయలంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన పార్లమెంటరీ పార్టీ భేటీ జరిగింది.

ఈ సమావేశంలో పార్లమెంటులో లేవనెత్తవలసిన అంశాలు, అనుసరించాల్సిన విధివిధానాలుపై చర్చించారు. రాష్ట్రాభివృద్ధికి అవసరమైన నిధులు, ప్రాజెక్టులు, పథకాలు తీసుకువచ్చేలా కృషి చేయాలని సూచించారు. రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా పెట్టుకొని సభ్యులందరూ వ్యవహరించాలని చంద్రబాబు సూచించారు. ఈసారి లోక్ సభలో తెలుగుదేశంకి 16 ఎంపీల బలం ఉన్నందున రాష్ట్రానికి ఎక్కువ నిధులు, మరిన్ని అభివృద్ధి ప్రాజెక్టులు వచ్చేలా చూడాలన్నారు. దేశంలోనే టాప్ 10 విశ్వవిద్యాలయాలు, ఆసుపత్రులు, పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకువచ్చేలా కృషి చేయాలని అన్నారు.

ప్రతీ ఎంపీ కేంద్రలో ఒక శాఖతో, అదే శాఖతో రాష్ట్రంలో కూడా సమన్వయం చేసుకుంటూ రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. కేంద్ర పథకాలను పూర్తిగా సద్వినియోగం చేసుకునేలా ఎంపీలు పని చేయాలని అన్నారు. ప్రజా రాజధాని అమరావతి, ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టుల పూర్తికి సహకరించాలన్నారు. వీటితో పాటుగా విభజన చట్టంలోని హామీల అమలుకు కృషి చేయాలని సూచించారు.

సేంద్రీయ వ్యవసాయంలో దేశానికి ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలవాలన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో కూడా ఆంధ్రప్రదేశ్‌లో పెద్దఎత్తున సేంద్రీయ వ్యవసాయం నిర్వహించి ప్రోత్సహించామన్నారు. ఉపాధి హామీ కింద గతంలో రికార్డు స్థాయిలో రాష్ట్రంలో రహదారులు నిర్మించామని, కేంద్ర పథకాలతో ఇళ్లు నిర్మాణం చేపట్టామని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా రహదారలు, ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి మరింత లబ్ధి చేకూర్చేలా కృషి చేయాలన్నారు.

రాష్ట్రంలో ఉన్న జాతీయ రహదారులు, పొరుగు రాష్ట్రాలతో అనుసందానమై ఉన్న రహదారులు అభివృద్ధికి తోడ్పడాలన్నారు. అమరావతి-అనంతపురం ఎక్స్ ప్రెస్ హైవే ప్రాజెక్టును వీలైనంత త్వరగా పూర్తి చేసేలా కృషి చేయాలని చంద్రబాబు సూచించారు. ఈ భేటీలో టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేతగా నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లగా చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాద్ రావు, నంద్యాల ఎంపి బైరెడ్డి శబరి, కోశాధికారిగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని, పార్లమెంటరీ పార్టీ విప్‌గా గంటి హరీష్ నియమించారు.

ఈ భేటీలో కేంద్రమంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్, మరియు ఇతర పార్లమెంటు సభ్యులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ 'జన దర్బార్'

(మొదటిపేజీ తరువాయి..)
అక్కడే కూర్చొని బాధితుల నుంచి స్వయంగా అర్జీలు స్వీకరించారు. వారి కష్టాలను ఓపికగా విన్నారు. సమస్యల పరిష్కారానికి భరోసా ఇచ్చి పంపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జనవాణి కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి ఏవిధంగా వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారో ఇప్పుడు అదే స్ఫూర్తిని కొనసాగిస్తున్నారు. వెంటనే వారి సమస్యలకు ఓ



పరిష్కారం చూపే బాధ్యతను తీసుకున్నారు. బాధితులు చెప్పిన కొన్ని సమస్యలు ఇవి ....

### కుమార్తె అదృశ్యమైందని ఫిర్యాదు చేసి

విజయవాడలో చదువుకుంటున్న తన కుమార్తె మైనర్ అనీ... ఆమెను ప్రేమ పేరిట ట్రాప్ చేశారని, గత తొమ్మిది నెలలుగా ఆమె జాడ తెలియడం లేదని భీమవరం నుంచి వచ్చిన శివ కుమారి అనే బాధితురాలు పవన్ కళ్యాణ్ ముందు కన్నీటితో మొరపెట్టుకుంది. తమ కూతురు చదువుకునే విజయవాడ కమిషనరేట్ పరిధిలోనిది కావడంతో మాచవరం పోలీస్ స్టేషన్లో దీనిపై ఫిర్యాదు చేశామని, తమ కూతురు జాడ తెలిసినా పోలీసులు స్పందించడంలేదని వేదన చెందారు.

జాడ తెలిశాక కూడా తమ బిడ్డను తమకు అప్పగించడం లేదని ఈ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీని చూపారు. వెంటనే స్పందించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాచవరం సీఐకు ఫోన్ చేసి కేసు వివరాలు తెలుసుకున్నారు. దీనిపై చర్యలకు ఆదేశించారు. బాధితులను పార్టీ ఆఫీస్ వాహనంలోనే మాచవరం పోలీస్ స్టేషన్‌కు పంపించారు.

మాచర్ల నియోజకవర్గం రెంటచింతల ప్రాంతానికి చెందిన మత్స్యకారుడు జంపయ్యను ఇంటి కోసం సొంత మనవళ్లే వేధిస్తున్నారని, హింసిస్తున్నారని జంపయ్య దంపతులు పవన్ కళ్యాణ్ కి విన్నవించుకున్నారు. పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని వాపోయారు. అక్కడున్న రెవెన్యూ, పోలీసు అధికారులతో మాట్లాడతామని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు.

కర్నూలు జిల్లాకు చెందిన సువర్ణ తన కుమారుడికి బ్రెయిన్ ఆపరేషన్ కోసం ఆర్థిక సాయం అందించే ఏర్పాట్లు చేయాలని కోరారు.





జగయ్యపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో పని చేస్తున్న పాటి నాగరాజు అనే అవుట్ సోర్సింగు ఉద్యోగి తనను రాజకీయ పరమైన కారణాలతో కక్షకట్టి ఉద్యోగం నుంచి తొలగించారని, తనను ఆదుకోవాలని పవన్ కళ్యాణ్‌కి వినతిపత్రం అందజేశారు.

30 మంది దివ్యాంగులు తమ సమస్యలను చెప్పుకునేందుకు పార్టీ కార్యాలయానికి తరలివచ్చారు. వారందరితో ప్రత్యేకంగా మాట్లాడిన పవన్ కళ్యాణ్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ | ఆదివారం 23, జూన్ 2024



## ‘తండేల్’ వైజాగ్, శ్రీకాకుళం షెడ్యూల్ పూర్తి

యువ సామ్రాట్ నాగ చైతన్య, సాయి పల్లవి జంటగా చందూ మొండేటి దర్శకత్వంలో అల్లు అరవింద్ సమర్పణలో ప్రతిష్టాత్మక గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై బన్నీ వాసు నిర్మిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ “తండేల్” వైజాగ్, శ్రీకాకుళం షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. నిజ జీవిత సంఘటనల నుంచి ప్రేరణ పొందిన “తండేల్” మునుపెన్నడూ చూడని లవ్ స్టోరీ.

మ్యాసీవ్ బడ్జెట్‌తో గ్రాండ్ స్కేల్‌లో రూపొందుతున్న ఈ మూవీ ఇండస్ట్రీలో న్యూ టెక్నికల్ బెంచ్‌మార్క్‌లను సెట్ చేయనుంది. మేకర్స్ వైజాగ్, శ్రీకాకుళంలోని సహజమైన, అందమైన లోకేషన్స్‌ని ఎంచుకున్నారు, నెరేటివ్‌కి రియలిజంను జోడించడానికి లోకల్ కమ్యునిటీస్‌ని విస్తృతంగా ఇన్వాల్ చేశారు.

నాగ చైతన్య, సాయి పల్లవితో పాటు ఇతర కీలక నటీనటులు పాల్గొన్న ఇటీవలే ముగిసిన షెడ్యూల్ ఈ చిత్రానికి కీలకమైనది. ఇందులో చాలా ముఖ్యమైన సన్నివేశాలు చిత్రీకరించారు. నాగ చైతన్య, సాయి పల్లవి ఇద్దరూ తమ కెరీర్‌లో మోస్ట్ ఛాలెంజింగ్ క్యారెక్టర్స్ చేస్తున్నారు. ఇందులో డి-గ్లామరస్ అవతార్‌లలో కనిపిస్తారు. దర్శకుడు చందూ మొండేటి పాత్రల గెటప్‌లు, కాస్ట్యూమ్స్, బాడీ లాంగ్వేజ్, ప్రాంతీయ యాస ప్రామాణికంగా ఉండేలా చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

## ‘జయహెూ రామానుజ’ లిరికల్ సాంగ్స్ లాంచ్



లయన్ డా. సాయి వెంకట్ నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న సినిమా ‘జయహెూ రామానుజ’. ఈ చిత్రాన్ని సుదర్శనం ప్రొడక్షన్స్ లో సాయిప్రసన్న, ప్రవల్లిక నిర్మిస్తున్నారు. అమెరికా నటి జో శర్మ హీరోయిన్ గా నటిస్తుండగా..సుమన్, ప్రవల్లిక ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. రెండు భాగాలుగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా ఫస్ట్ పార్ట్ జూలై 12న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, సంస్కృత భాషల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇటీవల ‘జయహెూ రామానుజ’ సినిమా పాటలను తిలకించిన తెలంగాణ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనరసింహా, కోమటిరెడ్డి వెంకటరెడ్డి లయన్ సాయి వెంకట్ కు అభినందనలు అందజేశారు. పాటలు బాగున్నాయంటూ వారు ప్రశంసించారు. ఈ నేపథ్యంలో ఈ రోజు ‘జయహెూ రామానుజ’ లిరికల్ సాంగ్స్ విడుదల కార్యక్రమాన్ని హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్ లో ఘనంగా నిర్వహించారు.

దర్శకుడు వీరశంకర్ మాట్లాడుతూ – ‘జయహెూ రామానుజ’ చిత్ర సాంగ్స్ బిగ్ సీడీ రిలీజ్ చేయడం సంతోషంగా ఉంది. ఈ సినిమా సాంగ్స్ అన్నీ చాలా బాగున్నాయి. భక్తిని, చైతన్యాన్ని అందించేలా సంగీత సాహిత్యాలు కుదిరాయి. ‘జయహెూ రామానుజ’ సినిమా ఈతరం ప్రేక్షకులు చూడాల్సిన సినిమా అన్నారు.

## కోటి చేతుల మీదుగా ప్రణయగోదారి సాంగ్

సరికొత్తగా ఆవిష్కరిస్తున్న కథలకు, నాచురల్ లొకేషన్స్‌లో షూట్ చేస్తున్న సినిమాలకు ఈ రోజుల్లో మంచి డిమాండ్ ఉంటోంది. సరిగ్గా ఇదే పాయింట్ బేస్ చేసుకొని ఓ డిఫరెంట్ కంటెంట్‌తో ప్రణయగోదారి అనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. పిఎల్ విఘ్నేష్ దర్శకత్వంలో ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపొందుతోంది. ఈ సినిమాలో ప్రముఖ కమీడియన్ అలీ ఫ్యామిలీ నుంచి వచ్చిన నటుడు సదన్, ప్రియాంక ప్రసాద్, సునీల్ రావినూతల, 30 ఇయర్స్ పృథ్వీ, సాయి కుమార్ ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు. పిఎల్‌వి క్రియేషన్స్‌పై ఎంతో ప్రతిష్టాత్మకంగా పారమళ్ళ లింగయ్య ఈ ‘ప్రణయగోదారి’ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలతో బిజీగా ఉన్న యూనిట్.. జోరుగా ప్రమోషన్స్ కూడా చేస్తున్నారు. ఇందులో భాగంగా తాజాగా ఈ మూవీలో నుంచి ఫీల్ గుడ్ సాంగ్ లాంచ్ చేశారు. ప్రముఖ సంగీత దర్శకులు కోటి చేతుల మీదుగా ఈ సాంగ్ లాంచ్ చేశారు. కలలో కలలో.. అంటూ సాగిపోతున్న ఈ ప్రేమ గీతంలో లవ్ బీట్ అదిరిపోయిందని చెప్పుకోవాలి. ఇక గోదావరి అందాలు, నాచురల్ లొకేషన్స్ లో షూట్ చేసిన సీన్స్ ఫ్రెష్ ఫీలింగ్ తెప్పిస్తున్నాయి. హీరో హీరోయిన్ కాస్ట్యూమ్స్‌తో పాటు సైడ్ డాన్సర్స్ లుక్స్ కూడా ఈ పాటలో ఆకర్షణీయంగా మారాయి. ఈ సాంగ్ లాంచ్ చేసిన మ్యూజిక్ డైరెక్టర్ కోటి మాట్లాడుతూ.. ప్రణయగోదారి నుంచి ఈ సాంగ్ చూస్తుంటే ఫ్రెష్ ఫీలింగ్ కలుగుతోందని, అన్ని వర్గాల ఆడియన్స్ మెచ్చేలా ఈ సాంగ్ షూట్ చేశారని అన్నారు. పాటలోని లిరిక్స్, బీట్, అందుకు తగ్గ సన్నివేశాలు, నటీనటుల వేషధారణ అన్నీ కూడా చాలా బాగా కుదిరాయని అన్నారు.







### ‘కల్కి 2898 ఎడి’

## రిలీజ్ ట్రైలర్


మోస్ట్ ఎవైటెడ్ అప్ కమింగ్ సైన్స్ ఫిక్షన్ ఎపిక్ ‘కల్కి 2898 ఎడి’ ఫస్ట్ ట్రైలర్ మ్యాసీవ్ రెస్పాన్స్ తో గ్లోబల్ గా సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఆడియన్స్ ఎంతోగానో ఎదురుచూస్తున్న రిలీజ్ ట్రైలర్ ఇప్పుడు విడుదల చేశారు మేకర్స్. ఫస్ట్ గ్లింప్స్ భారతీయ పురాణాలలో రూట్ అయిన ‘కల్కి 2898 ఎడి’ సినిమాటిక్ యూనివర్స్ ని ప్రేక్షకులకు పరిచయం చేస్తే, తాజా ట్రైలర్ ఇంకా డీప్ గా ఎపిక్ నెరేటివ్ ని మహా అద్భుతంగా చూపింది. ట్రైలర్ వారి అద్భుతమైన అవతారాలలో లార్జర్ దెన్ లైఫ్ హీరోలను ప్రజెంట్ చేసింది. మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ ‘అశ్వత్థామ’గా డేరింగ్ స్టంట్స్ ని పెర్ఫామ్ చేశారు. ఉలగనాయగన్ కమల్ హాసన్ ‘యాస్కిన్’గా గుర్తించలేని డెడ్లీ అవతార్‌లో కనిపించారు. ‘బుజ్జి’తో కలిసి ప్రభాస్ ‘భైరవ’గా బౌంటీ హంట్ లో అదరగొట్టారు. దీపికా పదుకొణె ‘సుమతి’ పాత్రను పోషించింది, ప్రెగ్నెంట్ ఉన్నప్పుడు తన పాత్రలో ఇంటెన్స్ ఛాలెంజస్ ని ఎదుర్కొంటుంది. దిశా పటానీ ‘రాక్సీ’గా పవర్ ఫుల్ ప్రెజెన్స్ తో ఆకట్టుకుంది. ట్రైలర్ కల్కి 2898 ఎడిలోని మూడు డిఫరెంట్ వరల్డ్స్ ని పరిచయం చేసింది. కాశీ, మనుగడ కోసం పోరాడుతున్న చివరిగా మిగిలిన నగరంబీ కాంప్లెక్స్, ఉన్నత వర్గాలచే నియంత్రించబడే ఆకాశంలో ఒక స్వర్గంబీ మూడోది శంబాలా, కాంప్లెక్స్ ద్వారా హింసించబడిన వారికి ఆశ్రయం అందించే ఒక ఆధ్యాత్మిక భూమి.



## ‘దేవర’లో ఎగ్జయిటింగ్ ఎక్స్‌పీరియెన్స్ - కొరియోగ్రాఫర్ బాస్కో మార్టిస్

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ టైటిల్ పాత్రలో నటిస్తోన్న భారీ బడ్జెట్ చిత్రం ‘దేవర’. ప్రముఖ దర్శకుడు కొరటాల శివ డైరెక్షన్‌లో ఈ మూవీ అత్యద్భుతంగా, శరవేగంగా చిత్రీకరణను జరుపుకుంటోంది. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ సినిమాలో మరో బాలీవుడ్ స్టార్ సైఫ్ అలీఖాన్ కీలక పాత్రను పోషిస్తున్నారు. ‘దేవర’లో ప్రముఖ బాలీవుడ్ కొరియోగ్రాఫర్ బోస్కో మార్టిస్ కొరియోగ్రఫీ చేయనున్న కొత్త పాట చిత్రీకరణ కోసం టీమ్ థాయిలాండ్ వెళ్లింది. పఠాన్, వార్, ఫైటర్ వంటి చిత్రాల్లో అద్భుతమైన స్టెప్స్‌ను కంపోజ్ చేసిన కొరియోగ్రాఫర్‌గా బాస్కో మార్టిస్‌కు మంచి క్రేజ్ ఉంది. ఇప్పుడు మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ దేవర చిత్రానికి పని చేస్తుండటంపై బాస్కో ఎగ్జయిట్ అయ్యారు. ఆయన తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఫొటోను షేర్ చేయటం ద్వారా తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. బాస్కో షేర్ చేసిన ఆ ఫొటోలో ఫ్రెష్ లుక్‌తో ఉన్న ఎన్టీఆర్‌ను చూడొచ్చు. ఎన్టీఆర్ అసాధారణ ప్రతిభను బాస్కో కొనియాడారు. అలాగే బిహైండ్ సీన్స్‌కు సంబంధించిన గ్లింప్స్ అందరిలోనూ అంచనాలను మరింతగా పెంచాయి. ఎన్టీఆర్ ఎంత గొప్ప డాన్సరో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అలాంటి స్టార్‌కు బాస్కో మార్టిస్ నృత్యరీతులను కంపోజ్ చేయటమనేది అందరిలోనూ ఉత్సాహాన్ని నింపుతోంది.

## ‘బూమ్ బూమ్ లచ్చన్న’ సాంగ్ విడుదల



‘నా పేరు శివ’, ‘అంధగారం’ తదితర హిట్ చిత్రాల్లో నటించిన వినోద్ కిషన్ ను ‘పేక మేడలు’తో హీరోగా అనూష కృష్ణ హీరోయిన్ గా నటిస్తున్న సినిమా పేక మేడలు. ఎవరికి చెప్పొద్దు సినిమాతో క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ సంస్థను స్థాపించి విజయాన్ని అందుకొని ఇప్పుడు పేక మేడలు సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. గతంలో ఈ సినిమాకు సంబంధించిన టీజర్ విశ్వక్సేన్ చేతుల మీద విడుదల చేయగా టీజర్ కు చాలా మంచి స్పందన లభించింది. ఇప్పుడు ఈ సినిమా నుంచి ఫస్ట్ సాంగ్ బూమ్ బూమ్ లచ్చన్న విడుదలైంది. లక్కు నీ వెంట కుక్క తోక లెక్క ఊపుకుంటూ వచ్చరో లచ్చన్న అంటూ సాగే ఈ సాంగ్ సింగర్ మనో గారు పాడగా లిరిక్స్ రాసింది భార్గవ్ కార్తీక్. స్మరణ్ సాయి అందించిన మ్యూజిక్ చాలా ఎట్రాక్టివ్ గా కొత్తగా ఉంది. ఈ పాట అధ్యంతం వినోదాత్మకంగా చిత్రీకరించినట్టుగా తెలుస్తోంది. ఒక మంచి కాన్సెప్ట్, కంటెంట్ ఉన్న స్టోరీగా ఈ సినిమా ఖచ్చితంగా మంచి విజయం సాధిస్తుంది. ఈ సినిమా జూలైలో విడుదల చేస్తున్నట్టు తెలిపారు మూవీ టీం.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144